గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 4 హైదరాబాద్
శుక్రవారం 26 జనవరి 2024 రూ.15-00
14 రజబ్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

జనులారా! అల్లాహ్‌ను మీ తప్పులకు క్షమాపణలు వేడుకోండి. ఆయన వైపు మరలండి. నేనయితే రోజు వందేసి మార్లు క్షమాపణకై అర్థిస్తూ ఉంటాను.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com



26

**ఆదోనిలో ఖిద్మత్ బ్రాంచ్ ప్రారంభం**

## లోపల...

| | | |
|---|---|---|
| భారతీయత | ...... | 04 |
| ఉత్తర దక్షిణాలు | ...... | 05 |
| చరితార్థులు–2 : నవాబ్ సాదత్ అలీ ఖాన్ | ...... | 09 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)–13 | ...... | 10 |
| ఆత్మీయ పలకరింపు | ...... | 14 |
| మతతత్వ మురికిలో సినిమా | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| కొత్త సంవత్సరం సరికొత్తగా మనం...! | ...... | 20 |
| అనుభూతులు ఆలోచనల అద్భుత కవనం | ...... | 22 |
| మట్టి రేణువులే అక్షరాలైతే.... | ...... | 28 |
| కత్తిమొన (కవిత) | ...... | 31 |
| విప్లవ జ్వాల | ...... | 32 |
| 'అంతర్వేదన' కథా సంపుటిపై సోదర వచనం | ...... | 34 |

**తొండి కూతలు....**



రేవంతు సర్కారును
కూల్చుతడట కేసిఆర్
పథకం వేస్తున్నడంట
జాగరత్త, హొషియార్ !
ఎలా అని అడగకండి
కలొచ్చిందట బండికి
ఆధారం చూపమంటే
వేస్తున్నడు మొండికి!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# భారతీయత

**ఢిల్లీలో** 2020లో అల్లర్లు జరిగాయి. అత్యంత భయంకరంగా జరిగిన ఈ అల్లర్లలో 50 మంది మరణించారు. ఇందులో ఎక్కువమంది ముస్లిములే. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన మయాంక్ రావత్ అనే 27 సంవత్సరాల యువకుడు ఈ అల్లర్లలో హింసాకాండ, మతతత్వాలను చూసి చలించిపోయాడు. సోషల్ మీడియాలో ముస్లిం వ్యతిరేక విద్వేష ప్రచారం అతడిని ఆలోచింపజేసింది. విద్వేష వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం చూశాడు. మయాంక్ ఇది భారతీయత కాదనుకున్నాడు. అమెరికా ర్యాప్ సంగీత కళాకారుడు జోయ్నర్ లూకాస్ కు అభిమాని అయిన మయాంక్ ర్యాప్ ఐడి పేరుతో తన స్వంత ర్యాప్ తయారు చేసి విడుదల చేశాడు.

మయాంక్ రావత్ హిందువు. మతవిద్వేషాన్ని, సమాజంలో విభజనలను అడ్డుకోవడం అవసరంగా భావించాడు. ఈ విషప్రచారాలు సమాజాన్ని నాశనం చేస్తాయని అనుకున్నాడు. ప్రజల్లో చైతన్యం పెంచడానికి తన స్థాయి ప్రయత్నం చేశాడు. మతవిద్వేష వాతావరణానికి వ్యతిరేకంగా అనేక ర్యాప్ స్వరాలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. మనం మనుషులమన్నది ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలని మయాంక్ అన్నాడు.

2019లో పౌరసత్వ సవరణ చట్టం వచ్చింది. మతపరమైన పక్షపాతంతో ఉన్న ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు పెల్లుబికాయి. తన మత సముదాయానికి చెందినవారు పెద్ద సంఖ్యలో ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేయడాన్ని పదిహేడేళ్ళ వయసులో చూశాడు అబ్దుర్రహ్మాన్ షేక్. ముంబయి ధారవిలో నివసిస్తుంటాడు. అప్పటి నుంచి భారత ముస్లిముల పరిస్థితిపై ర్యాప్ గీతాలు రాయడం ప్రారంభించాడు. అల్లర్లు, విద్వేషనేరాలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మతస్వేచ్ఛ అంతరిస్తుండడం తదితర అంశాలపై రాశాడు. ముస్లిముల హక్కుల గురించి, బలహీన వర్గాల గురించి మాట్లాడటం ప్రారంభించాడు. అతని గీతాలకు మొదట్లో పెద్ద స్థాయిలో ప్రజాదరణ లభించింది. ప్రజాదరణతో పాటు మతతత్వ శక్తుల బెదిరింపులు కూడా రావడం ప్రారంభమయ్యింది. హత్యచేస్తామన్న బెదిరింపులు కూడా వచ్చాయి.

ఇస్లామిక్ కౌన్సిల్ ఆఫ్ విక్టోరియా ప్రకారం 2022లో ప్రపంచంలో అత్యధికంగా ఇస్లామ్ విద్వేష ప్రచారం నడుస్తున్న దేశాలు మూడు. అమెరికా, బ్రిటన్, ఇండియా. ఇస్లామును టెర్రరిజంతో ముడివేసి ప్రచారం చేయడం, ముస్లిములు లైంగిక నేరాలు చేస్తారన్నట్లు చూపించడం, పాశ్చాత్యదేశాల్లో అయితే ముస్లిములు శ్వేతజాతీయుల కన్నా మించిపోతారన్న ప్రచారం, ఇండియాలో అయితే హిందువుల కన్నా మించిపోతారన్న ప్రచారం, హలాల్ అమానుషం అని చెప్పడం వగైరాలు అన్ని చోట్లా ఈ విద్వేష ప్రచారంలో కనిపిస్తాయి. ముస్లిం వ్యతిరేక విద్వేష ట్వీట్లలో 55.12 శాతం ఇండియా నుంచే వస్తున్నాయని కూడా తెలుస్తోంది.

ఈ సంవత్సరం ప్రారంభంలో సాహిల్ వాల్మిక్ అనే కొత్త ర్యాప్ కళాకారుడు తెరపైకి వచ్చాడు. దేశంలో ముస్లిం వ్యతిరేక రాజకీయాలను, ప్రచారాలను గమనిస్తూ వచ్చాడు. చానళ్ళలో జరుగుతున్న చర్చలను చూస్తూ వచ్చాడు. వాల్మిక్ తండ్రికి ప్రత్యేకంగా ఎన్నడూ ముస్లిములపై వ్యతిరేకత లేదు. కాని అలాంటి వ్యక్తి కూడా ముస్లిములపై విద్వేషం పెంచుకుని ఎన్నో ఏళ్ళుగా తమ ఇంటికి పాలు తెచ్చి ఇస్తున్న ముస్లిం పాలవాడితో అనుచితంగా వ్యవహరించడాన్ని వాల్మిక్ చూశాడు. ఈ విద్వేష వరదను ఆపడానికి ఏదైనా చేయాలనుకున్నాడు. ప్రధానస్రవంతి మీడియాలో వస్తున్న ప్రచారాలను ఖండిస్తూ ర్యాప్ గీతాలు రాసి విడుదల చేశాడు.

మధ్యప్రదేశ్‌కు చెందిన మీర్జా సుహేల్ బేగ్ ఈ వాతావరణాన్ని చక్కదిద్దడానికి నయీ సోచ్ పేరుతో ర్యాప్ గీతాలకు కలమెత్తాడు. తనతో కలిసి పెరిగిన హిందూ మిత్రులు ప్రస్తుత విద్వేష వాతావరణంలో తనకు దూరమవ్వడాన్ని అతను భరించలేకపోయాడు. కోవిడ్ వచ్చినప్పుడు జరిగిన ప్రాపగాండ చూశాడు. ముస్లిములను ఆర్థికంగా బాయ్‌కాట్ చేయాలన్న పిలుపులు విన్నాడు. మతతత్వ రాజకీయాలు చేస్తున్న నేతలను గుడ్డిగా నమ్మవద్దంటూ ర్యాప్ గీతాలు రాశాడు.

ఒకవైపు మయాంక్, షేక్, వాల్మిక్ వంటి ర్యాప్ కళాకారులు శాంతియుత సహజీవనాల భారతదేశం కోసం రాస్తుంటే మరోవైపు విద్వేషాన్ని ర్యాప్ గీతాల్లో నింపుతున్నారు.

శాంతియుత సహజీవనమే నిజమైన భారతీయతగా తప్పక నిలబడుతుందని ఆశిద్దాం.

అబ్దుల్ వాహెద్

# ఉత్తరదక్షిణాలు

**హఠాత్తుగా** భారత రాజకీయాల్లో ఉత్తర దక్షిణ భారతాల చర్చ మొదలయ్యింది. ఈ చర్చకు ముఖ్యమైన కారణం ఇటీవలి రాష్ట్ర ఎన్నికల ఫలితాలు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో బీజేపీ బలహీనమయ్యిందన్న సర్వేలు ఉన్నప్పటికీ ఈ రాష్ట్రాల్లో బీజేపీ ఘనవిజయాలు సాధించింది. కాంగ్రెసు కూడా ఈ రాష్ట్రాల్లో గెలవడానికి వీలయినంత వరకు సాఫ్ట్ హిందూత్వను ఉపయోగించుకోవాలనుకుని చేసిన ప్రయత్నాలు భంగపడ్డాయి. బీజేపీ హార్డ్ కోర్ హిందూత్వ ముందు కాంగ్రెసు నిలబడలేకపోయింది.

కాని దక్షిణ భారతదేశంలో బీజేపీకి కాలూనే జాగా దొరకడం లేదు. కర్నాటకలో ఓటమిపాలయ్యింది. దక్షిణ భారతదేశంలో బీజేపీ ప్రస్తుతం ఎక్కడాలేదు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీకి ఉనికిలేదు. ఈ నేపథ్యంలో ఉత్తర దక్షిణ భారతాలనే చర్చ మొదలయ్యింది. ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిలో ప్రజలు విద్యాపరంగాను, ఆర్థికంగాను మెరుగైన స్థితిలో ఉన్నారని, మతతత్వ రాజకీయాలకు ఇక్కడ అవకాశాలు చాలా తక్కువనే విశ్లేషణలు వచ్చాయి. క్లుప్తంగా చెప్పాలంటే దక్షిణ భారత దేశంలో బీజేపీ హిందూత్వ రాజకీయాలు పనిచేయవన్నది ఈ విశ్లేషణల సారాంశం. ఈ విశ్లేషణల్లో ఎంత వాస్తవముందో 2024 ఎన్నికల్లో ఎలాగూ తేలిపోతుంది. కాని ఈ విశ్లేషణలపై మాట్లాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

భారత రాజకీయాలను పరిశీలిస్తే 2008లో ముంబయి ఉగ్రవాద దాడులు జరిగాయి. 2009 ఎన్నికల్లో బీజేపీ ఈ ఒక్క అంశం పైనే గెలుస్తుందని అందరూ అనుకున్నారు. కాని అలా జరగ లేదు. జాతీయ భద్రత విషయంలో బీజేపీ ఎన్ని మాటలు చెప్పినా చివరకు ప్రజలు కాంగ్రెసునే ఆదరించారు. కాని 2010 నుంచి 2014 మధ్య కాలంలో సాంకేతికంగా చాలా మార్పులు వచ్చాయి. కాంగ్రెసు ఈ సాంకేతిక ప్రగతిని పట్టుకోవడంలో నిర్లక్ష్యం చేసింది. డిజిటల్ టెక్నాలజీని రాజకీయాలకు వాడుకో వచ్చన్నది కాంగ్రెసు ఊహకు కూడా అప్పట్లో అందలేదు. మరో వైపు భారతదేశంలో రాజకీయంగా బలమైన సముదాయాల్లో

అసంతృప్తిని కూడా కాంగ్రెసు నిర్లక్ష్యం చేసింది. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన మార్పులు కూడా గమనించదగినవి. ప్రపంచంలో చాలా దేశాల్లో మతతత్వ రాజకీయాలు బలపడ్డాయి. బలమైన నాయకుడు అనే వరదలో చాలా దేశాలు కొట్టుకుపోయాయి. బలమైన నాయకుడు అనే భావన వెనుక అధిక సంఖ్యాకవాదం కూడా ఉంది. ఆధిక్యతా రాజకీయా లున్నాయి. అయితే ఈ రాజకీయాలు బలపడడానికి ముఖ్యమైన కారణం డిజిటల్ టెక్నాలజీ అన్నది మరిచిపోరాదు. బిగ్ డాటా పేరుతో వచ్చిన సాంకేతిక విప్లవం పోస్ట్ ట్రూత్ కాలాన్ని కొత్తగా ఆవిష్కరించింది. ప్రజాభిప్రాయాన్ని మూసలో పోయడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడింది. ఇంటర్నెట్ వాడకం పెరిగింది. మొబైల్ ఫోన్ సేవలు ఊరూరా చొచ్చుకుపోయాయి. ఒకే ఇంట్లో అనేక మొబైల్ ఫోన్లు వచ్చాయి. సోషల్ మీడియా వేదికలు ప్రజాభిప్రాయాన్ని మలచడానికి కాదు ప్రజాభిప్రాయాన్ని తయారు చేయడానికి ఎలా వాడుకోవాలో తెలిసిన వాళ్ళు రంగం లోకి వచ్చారు. మార్కెటింగ్ రంగంలో కొత్త మాయాజాలం వచ్చింది. ఇష్టాయిష్టాలను ప్రభావితం చేయడం మొదలైంది. బిగ్ డాటా వీటన్నింటికి వెన్నెముకయ్యింది.

ది ఏజ్ ఆఫ్ యాస్పిరేషన్ అనే పుస్తకం 2018లో వచ్చింది. దిలీప్ హీరో ఈ పుస్తకాన్ని రాశారు. ఆయన ఒక ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టు. రాజకీయాల్లో డాటా ప్రాముఖ్యం ఎలా పెరిగిందో ఆయన వివరించారు. రాజకీయాల్లో డాటా ప్రాముఖ్యాన్ని గుర్తిం చిన బీజేపీ 2010లోనే ఐటి యూనిట్ స్థాపించిందని పేర్కొ న్నారు. నేషనల్ డిజిటల్ ఆపరేషన్స్ సెల్ పేరుతో ప్రారంభమైన ఈ ఐటి సెల్ త్వరలోనే పెద్ద డాటాబేస్‌ను తయారు చేసుకో గలిగింది. 2014లో సాధారణ ఎన్నికల్లో ఈ ఐటి సెల్ తన బలమేమిటో చూపించింది. 155 పట్టణ నియోజకవర్గాలను డిజిటల్ సీట్లుగా గుర్తించి పనిచేశారని దిలీప్ పేర్కొన్నారు. డాటాను వాడుకుని, సోషల్ మీడియా వేదికలపై బీజేపీ రాజకీయ ప్రాబల్యాన్ని కాంగ్రెసు బిత్తరపోయి చూడడం తప్ప ఏమీ చేయలేకపోయింది. స్టేట్స్‌మెన్, ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూస్తాన్ టైమ్స్, ది ట్రిబ్యూన్‌లకు పనిచేసిన స్వాతి చతుర్వేది రాసిన పుస్తకం "ఐయామ్ ఎ ట్రోల్: ఇన్ సైడ్ ది సీక్రెట్ వరల్డ్ ఆఫ్ బీజేపీస్ డిజిటల్ ఆర్మీ" ఈ ఐటి సెల్ గురించి వివరాలు తెలుసుకోడానికి ఉపయోగపడే పుస్తకం.

బిగ్ డాటా, సోషల్ మీడియా, ఐటి సెల్ వీటిని వాడుకోవడంతో బీజేపీకి లభించిన మరో కార్పొరేట్ దిగ్గజాలను తనవైపు తిప్పుకోవడం, దాంతోపాటు ప్రవాస భారతీయుల్లో కూడా చొచ్చుకుపోడానికి, ది ఓవర్సీస్ ఫ్రండ్స్ ఆఫ్ బీజేపీలు ఉనికిలోకి రావడానికి తోడ్పడింది. చివరకు ఈ టెక్నాలజీ బీజేపీ విజయ రథంగా మారింది. 2014 ఎన్నికల్లో కాంగ్రెసును గద్దె దించి బీజేపీ అధికారంలోకి రాగలిగింది. కాంగ్రెసు ఈ పరిణామాలను బిత్తరపోయి చూడడం తప్ప ఏమీ చేయలేకపోయింది.

గమనించవలసిన విషయమేమిటంటే, 2014 ఎన్నికల్లో అవినీతికి వ్యతిరేకంగా మొదలైన అన్నాహజారే ఉద్యమానికి ప్రజామద్దతు కూడగట్టడంలోను, గొప్ప ఉద్యమంగా నిలబెట్టడం లోను ఈ టెక్నాలజీయే ప్రధాన పాత్ర పోషించింది. 2014 ఎన్నికల్లో బీజేపీ ప్రస్తావించిన ముఖ్యమైన అంశాలు ఇవే. అవినీతిని అంతం చేయడం, నల్లడబ్బును తిరిగి తీసుకురావడం, అభివృద్ధి సాధించడం. అప్పటి బీజేపీ ప్రచారంలో ఎక్కడా హిందూత్వ లేదా మతతత్వ రాజకీయాలు బలంగా లేవు. నిజం చెప్పాలంటే వాజపేయి అద్వానీలు తమదే అసలైన లౌకికవాదం అనేవారు.

క్రమేణా పరిస్థితి మారింది. 2019లో బీజేపీ జాతీయభద్రత, దేశరక్షణ ప్రధానమైన నినాదాలుగా ఎన్నికలు గెలిచింది. అంతకు ముందు చెప్పిన అవినీతిని అంతం చేయడం, నల్లడబ్బును తీసుకురావడం, అభివృద్ధి వగైరా హామీల గురించి ప్రజలు ఆలోచించే వాతావరణమే లేని, భావోద్రేకాల జాతీయభద్రత సోషల్ మీడియా వేదికలను ముంచెత్తింది. 2014 నుంచి 2019 మధ్య కాలంలో వచ్చిన మరో పరిణామం, ఇదే సోషల్ మీడియాలో ఫేక్ వార్తల ప్రచారం. ఫేక్ వార్తల సునామీ సామాజికమాధ్యమాలను ముంచెత్తుతోంది. కరోనా సమయంలో ముస్లిములను విలన్లుగా చిత్రీకరించడం మొదలుకుని అనేక ఉదాహరణలు మనం ఇవ్వవచ్చు. ఈ ఫేక్ వార్తల గోబెల్ ప్రచారం ఏం సాధించిందన్నది ఆలోచించవలసిన విషయం. 2014 వరకు తమదే అసలైన లౌకికవాదంగా బీజేపీ నేతలు చెప్పుకుంటూ వచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మారి తమదే అసలైన హిందూత్వంగా లౌకికవాద పార్టీలు చెప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మార్పు వెనుక ఉన్నది బిగ్ డాటాను సమర్థ వంతంగా వాడుకున్న మాన్యుఫాక్చరింగ్ కాన్సెంట్ ప్రక్రియ.

ఇప్పుడు బీజేపీకి ఎన్నికలు గెలవడానికి మరో సమస్య అవసరమే లేదు. 2024 ఎన్నికలను కూడా హిందూత్వ ఆధారంగా గెలిచే వాతావరణం దాదాపు ఏర్పడింది. 2019లో పుల్వామా ఉగ్ర

దాడి జరిగింది. ఈ దాడి ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఇంటిలిజెన్స్ వైఫల్యాలేమిటి? అన్న ప్రశ్నల కన్నా ఎక్కువగా ఎలా పాకిస్తాన్ లోపలికి చొరబడి మన వైమానిక దళం బాలాకోట్‌పై దాడి చేసింది? ఎలా నరేంద్రమోడీ ఒక గొప్ప నాయకుడిగా ప్రతచర్య తీసుకుని చూపించారు అనే ప్రచారమే ఎక్కువగా జరిగింది. దేశంలోని ప్రతి మొబైల్ ఫోనులోను వాట్సప్ సందేశాలు ముంచెత్తాయి. ఇప్పుడు కూడా మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న ఇస్రాయీల్, హమాస్ యుద్ధాన్ని ఇక్కడ ముస్లిములను విలన్లుగా చిత్రీకరించడానికి వాడుకుంటూ వాట్సప్ సందేశాలు ఉధృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ వాట్సప్ సందేశాల్లో చాలా వరకు ఫేక్ వార్తలే అన్నది కూడా బయటకు వచ్చింది. కాని ఈ ఫేక్ వార్తలను నమ్మే వారు చాలా మందిని తయారు చేసుకోవడం ఇప్పటికే జరిగిపోయింది. అక్టోబర్ 7వ తేదీన ఇస్రాయీల్ పై జరిగినదాడి మాదిరి దాడులు ఇక్కడ కూడా జరుగుతాయని హెచ్చరిస్తూ, ఇస్రాయీల్ కేవలం 70 లక్షల మంది యూదులు సమైక్యంగా ఉండడం వల్ల 55 ముస్లిం దేశాల కన్నా బలంగా ఉన్నారని, కాని ఇండియాలో 100 కోట్ల మంది హిందువులు కులాలవారిగా విడిపోయి బలహీనులుగా, అణచివేయబడి తమ స్వంత దేశంలో బతుకుతున్నారని ఇలాంటి అనేక సందేశాలు ఇప్పుడు చక్కర్లు కొడుతున్నాయి. వీటిని నమ్మే వాళ్ళు కూడా తయారై ఉన్నారన్నది మరిచిపోరాదు. ఒకవైపు ఇస్రాయీల్ హమాస్ యుద్ధాన్ని వాడుకుని ఇక్కడ దేశంలో మతవిద్వేషాలు రగిల్చే ప్రయత్నాలు, మరోవైపు అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రచారాలు, ఇంకోవైపు పౌరసత్వ సవరణ చట్టం తదితర చర్యలు తీసుకుని బలమైన హిందూరాష్ట్రగా ఏర్పడతామన్న సందేశాలు... ఇవన్నీ దేశాన్ని ఒక మూసలో పోస్తున్నాయి.

కాని ఈ మొత్తం వ్యూహంలో ఒక లోపం ఉంది. భారత సమాజంలో కులాల నిచ్చెన నుంచి ఎవ్వరు కిందికి దిగడానికి సిద్ధంగా లేరు. 2011 జనాభా లెక్కల ప్రకారం 80 శాతం జనాభా దేశంలో హిందు జనాభా. 2014లో బీజేపీకి 31 శాతం ఓట్లు లభించాయి. 2019లో బీజేపికి 38.4 శాతం ఓట్లు లభించాయి. 2024లో ఈ ఓట్ల శాతం పెరుగుతుందా? తగ్గుతుందా? అన్నది భవిష్యత్తులో భారతదేశం ఏ దిశన ప్రయాణిస్తుందో చెప్పే మైలురాయి.

ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమిటంటే భారత రాజకీయాల్లో కాంగ్రెసు బలంగా ఉన్నప్పుడు ఒక సోషల్ ఇంజనీరింగ్ కాంగ్రెసు తరఫున కూడా జరిగేది. అగ్రవర్ణాలు, దళితులు, మైనారిటీల ఒక ఓటు బ్యాంకు కాంగ్రెసుకు ఉండేది. 1950 నుంచి 1980ల వరకు ఈ ఓటు బ్యాంకు చెక్కు చెదర లేదు. మిశ్రమ ఆర్థిక విధానాలు, లౌకికవాదం, స్వతంత్రపోరాట జ్ఞాపకాలు ఇవన్నీ కలిసి కాంగ్రెసును గెలిపిస్తూ వచ్చాయి. కాని 90ల్లో పరిస్థితి మారింది. భారతదేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు వచ్చాయి. కాంగ్రెసు ఓటు బ్యాంకు ఆ తర్వాత తడబడడం ప్రారంభమయ్యింది. మొదట అగ్రవర్ణాలు బీజేపికి చేరువయ్యాయి. క్రమేణా బీసీలు వెళ్ళిపోయారు. చివరకు 2014లో ఓటమి తప్పలేదు.

ఇటీవల బీజేపీ సాధించిన ఘనవిజయాలు ఎలా ఉన్నప్పటికీ దేశంలోని వివిధ కులాల మధ్య ప్రగతి ఫలాల పంపిణీలో లోపాలు బయటపడితే ఈ విజయాలను నిలబెట్టుకోవడం కష్టం. ముఖ్యంగా ఎవరి జనాభా ఎంత ఉంది? ఎవరికి ఎంత వాటా లభిస్తుందన్న వివరాలు బయటకు వస్తే ఈ విసయాలను నిలబెట్టుకోవడం కష్టం. బీజేపీ సోషల్ ఇంజనీరింగ్ లో చాలా చాకచక్యంగా ఇతర వెనుకబడిన కులాలను, అత్యంత వెనుకబడిన కులాలను, దళితులను సాంస్కృతీకరణ వేదికపై ఒక్కటి చేయగలిగింది. ఒకరకమైన గుర్తింపు తో వారందరూ ఒక్కటయ్యేలా చేయగలిగింది. ఈ సముదాయాల మద్దతు పొందడానికి సాంస్కృతీకరణతో పాటు బీజేపీ వ్యూహంలో మరో అంశం లాభార్థులుగా మార్చడం. అంటే వివిధ సంక్షేమ పథకలు, నగదు బదిలీలు, ఆహారధాన్యాల పంపిణీ ఇంకా ఇలాంటి అనేక స్కీముల ప్రయోజనం పొందేవారుగా మార్చడం ద్వారా వారి ఓట్లను పొందడం.

ఈ స్కీములు నిస్సందేహంగా పేదలకు చాలా ఉపయోగకర మైనవే. కాని కేవలం ఈ స్కీముల ద్వారా అత్యంత వెనుకబడిన సముదాయాల్లో విద్యా, వైద్య, పోషకాహార లోపాలను పూరించడం సాధ్యం కాదు. సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుని వారి అభివృద్ధికి ప్రయత్నించడం ఒక పద్ధతి. కేవలం సంక్షేమ పథకాలపై ఆధారపడేలా మార్చడం మరో పద్ధతి. రాజకీయాలు రెండో పద్ధతినే ఎన్నుకుంటున్నాయి. బీజేపీ గెలుపు వెనుక ఇవన్నీ ఉన్నాయి. సాంస్కృతీకరణ, లాభార్థీ స్కీములు, బలమైన వ్యవస్థాగత సామాజికమాధ్యమాల ప్రచారం ఇవన్నీ కలిసి బీజేపీ విజయానికి బాటలు వేశాయి. కాని ఈ గెలుపును నిలబెట్టుకో వాలంటే సామాజిక న్యాయాన్ని నిలబెట్టాలి.

నవంబర్ 2022లో సుప్రీంకోర్టు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను సమర్థించింది. ఈ రిజర్వేషన్లు యస్సీ, యస్టీ, ఓబీసీలకు లభించవు. ఇవి అగ్రవర్ణాల కోసం ఉద్దేశించిన రిజర్వేషన్లు. మరోవైపు బీజేపీ కులజనగణన విషయంలో తీవ్రమైన వ్యతిరేకత చూపిస్తోంది. ఈ జనాభాలెక్కలు తీస్తే ఎవరి జనాభా ఎంత ఉంది. ఎవరికి ఎంత వాటా లభిస్తుందన్నది ముందుకు వస్తుంది. ఈ లెక్కలు ముందుకు వస్తే ఇప్పటి వరకు అమలు చేసిన సోషల్ ఇంజనీరింగ్ దెబ్బతింటుంది. అది ఉత్తరాదిలో అయినా, దక్షిణాదిలో అయినా ఫలితం ఒక్కటే. బీహారు కులగణన 2023లో విడుదల చేసింది. అక్కడ 27.12 శాతం ఓబీసీలు ఉన్నారు. 36.03 శాతం అత్యంత వెనుకబడిన బీసీలున్నారు. యస్సీలు 19.65 శాతం, యస్టీలు 1.68 శాతం ఉన్నారు. అంటే దాదాపు 81.47 శాతం జనాభా. ఈ జనాభాకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం వాటా లభించడం లేదన్నది స్పష్టం. సామాజికన్యాయమే ప్రధానంగా రాజకీయ చర్చ ప్రారంభమైతే ఈ జనాభా మొత్తం సామాజికన్యాయం కోసం నినదించడం ప్రారంభిస్తుంది. ఇప్పటి వరకు బీజేపీ ఓటు బ్యాంకుగా ఉన్న వాళ్ళు తరలిపోతారు.

దక్షిణాదిలో పరిణామాలను కూడా మనం గమనిస్తే, ఇండియాస్ న్యూ కేపిటలిస్ట్స్ అనే పుస్తకంలో హరీష్ దామోదరన్ రాసిన వివరాలు ఆసక్తికరమైనవి. వ్యవసాయం ప్రధానవృత్తిగా ఉన్న కాపు, కమ్మ, రెడ్డి, రాజు, నాదర్, కొంగునాడ్ నాయుడు తదితర సముదాయాలు వ్యాపారరంగంలోకి ప్రవేశించాయి. ఇది 20శతాబ్దంలో చోటు చేసుకున్న పరిణామం. మాన్యుఫాక్చరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజనీరింగ్, కన్ స్ట్రక్షన్, పోర్టులు, గనులు, సినిమాల్లో పెట్టుబడులతో వ్యాపారాలు ప్రారంభించారు. ఉదారవాద ఆర్థికవిధానాలు వారికి తలుపులు తెరిచాయి. కాని తర్వాత నోట్లరద్దు, హడావిడి జియస్టీ, ఇన్ సాల్వేన్సీ కోడ్ వంటివి చిన్నతరహా, మధ్యతరహా వ్యాపారాలకు గొడ్డలిపెట్టయ్యాయి. ఈ కంపెనీలన్నీ బడా కార్పోరేట్ల సామ్రాజ్యాలకు అమ్ముడుపోయే పరిస్థితి వచ్చింది. చివరకు జరిగిందేమిటంటే కొత్తగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన సముదాయాలు మళ్ళీ వెనక్కి తగ్గి, గతంలో మాదిరిగా వ్యాపారరంగంలో ప్రాబల్యం వహిస్తూ వచ్చిన అగ్రవర్ణాలే మళ్ళీ నిలదొక్కుకునే పరిస్థితులు వచ్చాయి. కర్నాటక, తెలంగాణల్లో కాంగ్రెసు విజయాల వెనుక ఈ పరిణామాల ప్రకంపనాలున్నాయి. అందుకే కాంగ్రెసు బలంగా కులజనగణన గురించి మాట్లాడుతోంది. ఓబీసీలను తనవైపు తిప్పుకునే ప్రయత్నాల్లో ఉంది. అయితే సామాజిక న్యాయం అనే వేదికపై వివిధ సముదాయాలను ఒక్కటి చేయటంలో కాంగ్రెసు విజయం సాధించగలదా? ఆ సామర్థ్యం ఇప్పుడు కాంగ్రెసు నేతలకు ఉందా? వేచి చూడాలి.

ఒకవైపు బీజేపీ అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం నిర్వహిస్తోంది. మరోవైపు కాంగ్రెసు భారత్ జోడో యాత్ర చేపట్టింది. 2024లో జరగబోయే సాధారణ ఎన్నికల్లో ప్రధాన సమస్యగా ఏ పార్టీ ఏ సమస్యలను ప్రస్తావిస్తుందో ఊహించడం కష్టం కాదు. బీజేపీ పూర్తిగా హిందుత్వ రాజకీయాలతోనే ఈ ఎన్నిక గెలిచే ప్రయత్నాల్లో ఉంది. మరోవైపు కాంగ్రెసు సామాజికన్యాయం నినాదంతో ఎంతవరకు ఫలితాలు సాధిస్తుందో వేచి చూడాలి. ✤


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.


'చరితార్థులు'-2



# షహజాదా ఫెరోజ్ షా

(1832-1877)

31




**మాతృభూమిని** ఆంగ్లేయుల ఆధిపత్యం నుండి విముక్తం చేయడం కోసం సాగిన సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాటంలో కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు ఆంగ్లేయులతో రాజీలేని పోరాటం సాగించిన మొఘల్ షహజాదా ఫెరోజ్ షా 1832లో ఢిల్లీలో జన్మించారు. ఆయన తండ్రి మొఘల్ పాదుషా షా ఆలం మనుమడు మీర్జా నిజాం భఖ్త్. 1855 మేలో మక్కాకు వెళ్ళి 1857 మేలో స్వదేశం వచ్చేసరికి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ నినాదం నలుమూలలా ప్రతిధ్వనిస్తోంది. ఆ శంఖారావంతో ఉత్తేజం పొంది 1857 జూన్‌లో గ్వాలియర్ సంస్థానంలోని మాండిసోర్‌ను కేంద్రంగా చేసుకుని ఆంగ్లేయుల మీద పోరుకు ఆయన సిద్ధమయ్యారు. బ్రిటీషర్ల అనుకూలుడైన గ్వాలియర్ సంస్థానాధీశుడు ప్రభుభక్తిని చాటుకునేందుకు మాండిసోర్ వదలి వెళ్ళాల్సిందిగా ఫెరోజ్ షాను ఆదేశించాడు. ఆ హెచ్చరికలను ఖాతరు చేయని ఫెరోజ్ షా నగరం బయట మకాం చేశారు. ఆయన ప్రయత్నాల ప్రభావంతో మాతృభూమి కోసం ప్రాణాలు త్యాగం చేసేందుకు ప్రజలు, యువకులు, స్వదేశీ సైనికులు మొత్తం మీద 18వేల మంది సిద్ధమయ్యారు. ఆ స్వదేశీ యోధులతో రణ నినాదం చేసిన ఫెరోజ్ షా 1857 ఆగస్టు 26న మాండిసోర్‌ను ఆంగ్లేయుల నుండి స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత రెండు సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా పోరుబాటన సాగిన ఆయన రానొడ్, దానసా, షికాం, ఇంద్రాఘర్ ప్రాంతాలలో కంపెనీ అధికారులను మట్టి కరిపించారు. ఈ సందర్భంగా అవధ్ అధినేత్రి బేగం హజ్‌రత్ మహల్, కాన్పూరు నాయకులు నానా సాహెబ్‌లకు ఆయన క్రియాశీలక తోడ్పాటు అందించారు. ఆ ఐక్య సైన్యాలు తొలి దశలో ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాల మీద పలు విజయాలను సాధించాయి. అక్కడి నుండి ఢిల్లీ వెళ్లి అక్కడ ఆంగ్ల సైన్యాలతో జరుగుతున్న పోరాటంలో పాల్గొనాలనుకున్నాయి. ఈలోగా ఢిల్లీ తిరిగి ఆంగ్లేయుల స్వాధీనమైనదన్న విషాదవార్త అందడంతో ఫిరోజ్ షా హతాశులయ్యారు. 1859 జనవరి 14న జైపూర్ సమీపాన చీమల దండులా కదలి వచ్చిన ఆంగ్లేయ సైనిక బలగాలతో పోరాడిన ఫెరోజ్ షా ప్రతికూల పరిస్థితులలో సిరోంజ్ అడవుల్లో తలదాచుకున్నారు. ఆయనను లొంగదీసుకునేందుకు ఆంగ్లేయాధికారులు చేసిన ప్రయత్నాలు వమ్ముకాగా ఆంగ్లేయ గూఢచారుల కన్నుగప్పి తొలుత ఆఫ్ఘనిస్తాన్ చేరారు. 1860 నాటికి కాందహార్, 1862లో టెహరాన్ వెళ్ళి అటు నుండి పలు సంక్లిష్ట మజిలీల తరువాత 1875లో ఫెరోజ్ షా మక్కా చేరుకున్నారు. మక్కా నుండి సైనిక బలగాల సమీకరణకు ప్రయత్నిస్తూ పలు ఇక్కట్లను ఎదుర్కొన్న షెహజాదా ఫెరోజ్ షా 1877 డిసెంబరు 8న అంతిమశ్వాస విడిచారు. ✤




9440241727


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

అధ్యాయం -5

14

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

### 1 ఖలీఫాగా ఆయన పరిపాలన

మహనీయ అబూ బక్ర్ సిద్దీక్(ర) ఖిలాఫత్ గ్రహించిన సంవత్సరం పూర్తిగా అత్యంత హడావిడిగా, సంగ్రామ మయంగా సాగింది. ఒక వైపున ధార్మిక తిరుగుబాటు, మరోవైపున దొంగ ప్రవక్తల తీరుబాటునివ్వని ఉత్కంఠ, తత్కారణంగా రాజ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అన్ని విధాలా సువ్యవస్థీకరించే అవకాశం ప్రాప్తం కాలేక పోయింది. అయినా ఆయన తీసుకున్న కొన్ని చర్యలను గమనిద్దాము.

1 మహనీయ ఉమర్ ఫారూక్ (ర)ను రాజధాని నగరం మదీనాలో న్యాయాధిపతి బాధ్యతపైన నియోగించడం జరిగింది. కాని ఆయన ఆ బాధ్యత నిర్వహించిన రెండేళ్ళు ఒక్క కేసు కూడా ఆయన న్యాయస్థానంలో నమోదు కాలేదు. అంటే మదీనాలో అన్ని విధాలా శాంతి నెలకొన్నదన్న మాట. అపరాధాలు పూర్తిగా సమసి పోయాయన్నమాట. మదీనాకు వెలుపల దొంగ ప్రవక్తలతో, ధార్మిక తిరుగుబాటుదారులతో యుద్ధాలు జరుగుతూ ఉన్నా మదీనా పవిత్ర నగరిలో ఎటువంటి ఘర్షణల్లేవు!

2 మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (ర), ఆర్థిక వ్యవహారాల ప్రధానాధికారి. జకాత్, ఇతర సదకాత్ సొమ్ము వసూలు పంపిణి, ఖర్చులు ఈయన ఆధ్వర్యాన జరిగేవి.

3 మహనీయ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్, మరి జైద్ బిన్ సాబిత్ బాధ్యతలో ఉత్తర ప్రత్యుత్తరాలు, దేశ విదేశాల తోనూ, స్వయంగా ప్రభుత్వ అధికారులతోనూ, సేనా పతులతోనూ, పరిపాలనా వ్యవహారాల్లో ఆదేశాలు జారీ చేయడం, వారి లేఖలకు సమాధానాలివ్వడం, వీరి బాధ్యతల్లోని అంశం.

4. దేశంలోని విభిన్న ప్రాంతాల్లో నియుక్తులయిన గవర్నర్లు, తహ్సీల్దారులతో ఖలీఫా అబూ బక్ర్, నిత్యం క్రమబద్ధంగా సంబంధం కలిగి ఉండేవారు. వారికి ఏదయినా సందేశం అంద జేయాలంటే దానికి ప్రత్యేక గూఢచారులుండేవారు.

5. ఏ వ్యక్తి అయినా ఎటువంటి పరిస్థితిలోనయినా సలహా సంప్రతింపులు లేకుండా ఏ చర్యనయినా గైకొనలేదు.

ధార్మిక తిరుగుబాటు కాలంలోనూ, దొంగ ప్రవక్తల కాలం లోనూ విభిన్న ప్రాంతాల నాయకులతో, సేనా నాయకుల తోనూ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ చరిత్ర గ్రంథాలలో సురక్షితంగా ఉన్నాయి.

ఈ విధంగా మహనీయ అబూబక్ర్ (ర) ఖిలాఫత్ మొదటి సంవత్సరం ఎంతో పూర్ణ నిమగ్నతతో గడిచిందన్న విషయం ద్యోతకమవుతుంది. అందువల్లనే హజ్జ్ కొరకు నాయకునిగా ఆయన తన స్థానంలో అతాబ్ బిన్ అసీద్‌ని నియమించారు.

జాబిర్ బిన్ అబ్దుల్లా ప్రకారం, బహ్రైన్ నుండి పెద్ద ఎత్తున ధనం ప్రాప్తమయింది. అప్పుడు ఖలీఫా అబూబక్ర్ ప్రకటన చేయించారు, "దైవ సందేశహరులు ఎవరికయినా ఏదయినా ఇచ్చే వాగ్దానం చేసి ఉన్నట్లయితే వచ్చి చెప్పవలసిందని, తాము దాన్ని నిర్వర్తించగలమనీ"ను. అప్పుడు నేను వెళ్ళి చెప్పాను, దైవప్రవక్త(స) నాకు, "బహ్రైన్ నుంచి ధనం ప్రాప్త మయితే నీకు ఇంత (దోసిలితో మూడు సార్లు చూపి) ధనం ఇస్తానని చెప్పార"ని.

దానికి అబూబక్ర్ ఒక దోసిలి నిండా ధనం ఇచ్చి ఎంచ మన్నారు. ఎంచితే అవి అయిదు వందల దిర్హములు. అబూ బక్ర్ నన్ను ఇంకా వెయ్యి దిర్హములు తీసుకోమని పురమాయించారు. ఆ తరువాత ఆయన దైవప్రవక్త(స) వాగ్దానం చేసిన ప్రతి వ్యక్తికీ సొమ్ము ఇచ్చారు.

మహనీయ అబూ బక్ర్(ర) పర్షియన్ల పట్లను, ఇరాక్‌లో రైతుల పట్లను మృదువుగా సానుభూతితో ప్రవర్తించ వలసిందని ఆ ప్రాంతంలోని తన పరిపాలన అధికారులకు, నాయకులకు ఆదేశాలిచ్చేవారు.

వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రాజ్య ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు, పరిపాలన సౌలభ్యానికి వెన్నెముక వంటిదని ఆయనకు బాగా తెలుసు.

పర్షియా నుండి మహనీయ ఖాలిద్ బిన్ వలీద్ తనకు సైనిక మద్దత్తు అవసరమని కోరినప్పుడు ఖలీఫా అబూ బక్ర్ కా'కా బిన్ అమ్ర్ తమీమీ (ర)ని పంపారు. ఎవరో అన్నారు, "ఓడి పోయిన సైన్యంలోని వ్యక్తిని మీరు మద్దత్తుగా పంపిస్తు న్నారు," అని. ఈ విమర్శ ఖలీఫా విన్నారు. బదులుగా ఆయన అన్నారు, "ఏ సైన్యంలో కా'కా వంటి సాహసవంతులుంటారో అది ఎన్నడూ ఓడిపోదు!"అని. ఆ సందర్భంలో పర్షియన్ నాయకత్వం హుర్ముజ్ అనే దౌర్జన్యుని హస్తగతమయి ఉండేది. అతను ఎత్తుగడలు వేయడం లోనూ మహా నేర్పరి.

అతను మహనీయ ఖాలిద్‌కు వ్యతిరేకంగా ఓ ఎత్తు వేశాడు. తన బాడీగార్డ్స్‌ని వంచనా పూర్వకంగా దాడి జరపమని నియ మించాడు. ఆ తరువాత అతను మహనీయ ఖాలిద్‌ని ఛాలెంజ్ చేశాడు పోటీకి రమ్మని. ఆయన వెంటనే మైదానం లోకి దుమికారు. ఇరువురు కరవాలాలతో కలయ బడ్డారు. ఇదే అదను అని హుర్ముజ్ బాడీగార్డ్స్ మహనీయ ఖాలిద్‌పైకి దాడి జరిపారు. వారు మహనీయ ఖాలిద్‌ని చుట్టుముట్టారు. అయినా ఇదంతా ఖాతరు చేయక మహనీయ ఖాలిద్ హుర్ముజ్‌ని హతమార్చి వేశారు. కాని స్వయంగా తాను శత్రు వుల చక్రబంధంలో చిక్కుకున్నారు. ఆ సందర్భంలోనే ఇస్లా మీయ సింగం కా'కా బిన్ అమ్ర్ ఈ దృశ్యం చూసి తన అశ్విక దళంతో ఆ బాడీగార్డ్స్ పైకి లంఘించారు. అప్పుడు ముస్లి ములు వెనక నుంచి హుర్ముజ్ సేన పైకి దాడి జరిపి పర్షియన్ సేన మట్టి కరిచేలా బుద్ధి చెప్పారు.

ఇలా ఖలీఫా చెప్పిన మాట నిజమయింది, "కా'కా వంటి యోధులున్న సేన ఎన్నటికీ ఓడిపోదు!"

యమన్ ప్రాంతాన్ని ఇస్లామ్ కిరణాలు జ్యోతిర్మయం చేసిన తరువాత జుల్ కలా' హిమ్యరీ తన జాతి తోపాటు మదీనా పవిత్ర నగరికి చేరినప్పుడు, ఆయన తో కేవలం ఆయన మాత్రమే కాదు, యమన్ వాసులందరూ అటువంటి భావననే ప్రదర్శించారు. ఉదాహరణకు హమ్దాన్ తెగ, హమ్జా బిన్ మాలిక్ హమ్దానీ నాయకత్వాన రెండు వేల మంది యోధు లతో మదీనా చేరాడు. వీరంతా ప్రవక్త మస్జిద్‌లోకి ప్రవేశించ గానే అక్కడ మహనీయ అబూ బక్ర్ కుర్‌ఆన్ పారాయణం వినగానే దైవ భీతి వల్ల కంపించసాగారు. ఆ రోదన విని మహనీయ అబూ బక్ర్ కూడా రోదించ సాగారు.

జుల్ కలా' హిమ్యరీ చూశారు, మహనీయ అబూ బక్ర్ ఓ బక్క పలచటి పెద్ద మనిషి, ఆయన తొడిగిన దుస్తులు సయితం అతి సాధారణ మయినవి, వాటి పైన ఎటువంటి ముత్యాలు, రత్నాలు కుట్టి లేవు. దానికి విరుద్ధంగా యమన్ నాయకులు వైభవో పేతమయిన దుస్తులతో ఠీవి ప్రదర్శిస్తూ వచ్చారు. వారి తలల పైన కిరీటాలు ఉంటే చుట్టూ వంద లాది సిపాయీలు పహరా కాస్తూ ఉంటారు. వారు ముస్లి ముల ఖలీఫా పాటించే సాధారణ విధానం, హుందా, ఠీవి,

వాటి కారణంగా ఆయనలో జాలువారుతున్న గొప్పదనం గాంభీర్యం చూసి యమన్ వాసులు కూడా ఆ సాధారణ విధానాన్ని అనుసరించడం మొదలెట్టారు.

ఆయన ప్రవక్త శ్రీ (స) తర్ఫీదు ద్వారా నేర్చుకున్న విధానాలలో ఒకటి పరాజిత ప్రాంతాల్లో న్యాయ సముద్ధరణ, శాంతి సంస్థాపన. ఆయన తన కమాండర్లకు ఇచ్చిన నిర్దేశాలలో, "ప్రజలపట్ల మార్దవం కరుణ, న్యాయం, ఉత్తమ ప్రవర్తన, ఇత్యాది గుణాలతో వ్యవహరించాలన్నది ప్రథమం. ఆ ప్రాంతాల్లో జనులు మానవతా మైత్రి, ఉన్నత సభ్యతా సంస్కారాల నాయకత్వాన్ని చవి గొనాలన్నది ఇస్లామీయ రాజ్య ఆకాంక్ష! అవి కేవలం పరిపాలనా సౌలభ్యానికి తీసుకున్న చర్యలు కావు, అవి ఇస్లామ్ బోధనాసారం.

★★★

## 2 ఆయన ప్రాథమికతలు

1. ప్రప్రథమంగా ఇస్లామ్ స్వీకరించిన స్వేచ్ఛాయుత పురుషుడు.
2. ప్రప్రథమంగా ఇస్లామ్ ప్రచారం కొరకు బహిరంగ ప్రసంగం చేసిన వ్యక్తి.
3. ప్రప్రథమంగా ఇస్లామ్ కొరకు దెబ్బలు తిన్న వ్యక్తి.
4. ప్రప్రథమంగా దివ్య కుర్ఆన్ని సమీకరించిన వ్యక్తి.
5. ప్రప్రథమంగా దివ్య కుర్ఆన్కు 'ముస్హఫ్' అని పేరు పెట్టిన వ్యక్తి.
6. ప్రప్రథమంగా ఖలీఫాగా పేరు పొందిన వ్యక్తి.
7. ప్రప్రథమంగా తండ్రి బ్రతికి ఉండగా ఖలీఫాగా నియుక్తులయిన వ్యక్తి.
8. ప్రప్రథమంగా తన తల్లిదండ్రులు బ్రతికి ఉండగా మరణించిన ఖలీఫా.
9. ప్రప్రథమంగా తన ప్రజల కొరకు బహూకరణలు నిర్ణయించిన ఖలీఫా.
10. ప్రప్రథమంగా రాజ్యంలో బైతుల్ మాల్ స్థాపించిన ఖలీఫా.
11. ప్రప్రథమంగా ఇస్లామ్ తరువాత బిరుదు పొందిన వ్యక్తి. బిరుదు : అతీక్!
12. ప్రప్రథమంగా షైఖుల్ ఇస్లామ్ అన్న బిరుదు కూడా ఈయనకే ఇవ్వడం జరిగింది.
13. ప్రప్రథమంగా, కడుపులో ఏదయినా అనుమానాస్పద వస్తువు లోనికి వెళ్ళిందేమోనని క్రక్కిన వ్యక్తి.
14. ప్రప్రథమంగా ఇస్లామ్లో మృత్యోపరి స్నానం భార్య చేయించిన వ్యక్తి కూడా ఈయనే!

## అబూ బక్ర్ సిద్దీక్ సూక్తులు

✤ మృత్యువును కాంక్షించండి, మీకు యజీవితం ప్రసాదించబడుతుంది.
✤ ఆత్మను పరిశుద్ధపరచుకోండి, జనుల ప్రవర్తన మీ ఎడల అదే చక్కబడుతుంది.
✤ అధికంగా సంభాషించడం కొన్ని అత్యవసర ముఖ్య విషయాలను మరిపిస్తుంది.
✤ తన (మానవ) సోదరునికి సహాయపడిన వానికి దైవం సహకరిస్తాడు.
✤ సత్కార్యాలు కష్టాల్లో పడకుండా కాపాడతాయి.
✤ సత్కార్యం చేసి కూడా నరకంలో పడవలసి వస్తే అందులో సత్కార్యం ఏదీ లేదు.
✤ అలాగే ఓ చెడుగు, దాని ప్రతిఫలం స్వర్గమయితే అందులో ఎటువంటి చెడుగు లేదు.
✤ ఎవని ఆంతర్యంలో విశ్వాస జ్యోతి ప్రజ్వలితమయి లేదో, ఎవరు దేవుని ద్వారా ప్రతిఫలాన్ని పొందే ఆశ కలిగి లేడో అతనికి ఎటువంటి ప్రతిఫలమూ లేదు. ఏ వ్యక్తి సంకల్పం సరయినది కాదో అటువంటి వ్యక్తి చేసిన ఏ ఆచరణా స్వీకారయోగ్యం కాదు.
✤ నేనొక చెట్టునయి ఉంటే ఎంత బావుండేది! జనం దాన్ని నరికి వినియోగించుకునేవారు.
✤ మహనీయ అబూ బక్ర్ పరలోక విచారణ పట్ల ఎంతగా భీతిల్లుతూ ఉండేవారు?! మరి మనమో!

## వచ్చేవారం నుండి

'భువిలో శుభవార్త' శీర్షికన మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఆదర్శ జీవితం **'విచక్షణా ప్రమాణం'** మకుటంతో మీ ముందుకు రాబోతోంది– ఇన్షాఅల్లాహ్

– ఎడిటర్

# తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ ప్రచురించిన

# మౌలానా మౌదూదీ (రహ్మ) పుస్తకాలు

1. దివ్యఖుర్‌ఆన్ (అనువాదం)
2. ఖుర్‌ఆన్ అవగాహనం (ఖుర్‌ఆన్ వ్యాఖ్యానం)
3. దివ్యఖుర్‌ఆన్ లోని పారిభాషికాలు
4. ఖుర్‌ఆన్ వైశిష్ట్యాలు
5. హ్రజత్ ఇమామ్ హుసైన్
6. మిలాద్-ఉన్-నబి
7. హేతువు కాంతిలో దైవప్రవక్త
8. దివ్యగ్రంథంలో దైవప్రవక్త
9. ఆర్థిక సంబంధాలు - ఇస్లామీయ పరిష్కారం
10. బ్యాంకింగ్- ఇన్సూరెన్స్- ఇస్లామ్
11. వడ్డీ కీడు
12. ధర్మపథంలో జీవనరథం
13. ఇస్లామ్ మరియు అజ్ఞానం
14. సాక్ష్యం మానవాళి సమక్షంలో
15. ఇస్లామ్ రాజకీయ సిద్ధాంతం
16. అంటరానితనం
17. శ్రేయస్కర మార్గం
18. మరణానంతర జీవితం
19. ధర్మసంస్థాపనం
20. ముఖ్యహితవులు
21. నిర్మాణం-విచ్ఛిన్నం
22. ఖుత్బాత్
(ఈమాన్, ఇస్లామ్, ఆరాధనలు, జకాత్, జిహాద్ వాస్తవికతలు)
23. కలిమయే తయ్యిబా అర్థం
24. మద్య నిషేధం
25. ధర్మపథం
26. సత్యధర్మం
27. దైవ మార్గంలో సతత సమరం- జిహాద్
28. సామాజిక న్యాయం
29. ఇస్లామీ పరిభాషలో జిహాద్
30. రండి ఈ ప్రపంచాన్ని మారుద్దాం
31. నవయుగం- నవతరం
32. మానవ హక్కులు
33. మేరాజ్ యాత్ర- సందేశం
34. జాతి నిర్మాణంలో నైతిక విలువలు
35. ఇస్లామ్ ధ్యేయం ఏమిటి?
36. ఇస్లామీయ వ్యవస్థలో ముస్లిమేతరుల హక్కులు
37. మద్రాస్ ప్రసంగం
38. ఏకేశ్వర వాదమంటే?
39. సందేశ ప్రచార ఉపాయం
40. ఇస్లామ్ వెలుగులో సామాజిక న్యాయం
41. ఇస్లాంలో బహుదైవారాధన లేదు
42. ఇస్లామీయ ఉద్యమం విజయానికి సోపానాలు
43. ఏసుక్రీస్తు సందేశం
44. పరదా
45. లైంగిక సంబంధాలు- ప్రకృతి నియమాలు
46. రమజాన్ శుభాలకు అర్హులు
47. రమజాన్ సత్కార్యాల సమాహారం
48. ఆత్మ ప్రక్షాళన- రోజా
49. త్యాగనిరతి
50. మనిషీ నీ పుట్టుక ఎంత అద్భుతం
51. దైవదౌత్యం పరిసమాప్తం
52. ఇదియే ఇస్లామ్



# ఆత్మీయ పలకరింపు

- ఎం.ఎ ఆరిఫ్, కొత్తగూడెం

**మనిషికి** దూరంగా ఉన్న మనసుకి దగ్గరగా ఉన్నానని గుర్తు చేసేదే ఆత్మీయ పలకరింపు. ప్రపంచంలోని అన్ని సంస్కృతుల లోనూ, వారిలోని ఎవరైనా వ్యక్తులు లేదా సమూహాలు ఎదురై నప్పుడు పరస్పరం ఎలా పలకరించుకోవాలో అభివాదం చేసుకోవాలో చెప్పబడింది.

పలకరింపు సమాజంలోని వ్యక్తులను దగ్గరకు చేరుస్తుంది. ఎదురుగా మనిషి కనిపించినప్పుడు బాగున్నావా అని పలకరిం చటం మన సంస్కారం. పలకరింపులో ఆత్మీయత తొణికిస లాడాలి. నీకు నేను తోడున్నాను అనే నమ్మకం కలిగించాలి, ఆ పదాలు మానసికంగా హృదయానికి హత్తుకోవాలి. ఎదుటి వ్యక్తి హక్కు అయి ఉండాలి. ఇద్దరు కలిసినప్పుడు ఒకరినొకరు పలుకరించుకోవడం అదొక మర్యాద. అంతకంటే గొప్ప ఆత్మీయత కూడా. పలుకరిస్తే వీడిదేం పోయింది. నోట్లో ముత్యాలన్నీ రాలిపోతాయా అనుకునేలా మనం ఉండరాదు.

ఎదుటివారిలో చిరునవ్వు తీసుకొచ్చేదే సరైన పలకరింపు. అదే పలకరింపులో ఉన్న గొప్పతనం. ముస్లిములు చేసే సలామ్‌లో ఒక చక్కటి ఆత్మీయ పలకరింపు ఉంది. దీనిద్వారా ఎదుటి వ్యక్తిపై అల్లాహ్ నుండి శుభాలు, శ్రేయాలు ఉంటాయని అర్థం. ఇస్లామీయ పద్ధతిలో 'అస్సలాము అలైకుమ్' అని పలకరించటం అంటే ఎదుటి వ్యక్తికి అల్లాహ్ నుండి శుభాలు కోరుతున్నాడని అర్థం. ఎదుటివారు 'వఅలైకుమ్ అస్సలామ్' అని పలుకుతారు. అంటే, అంతకంటే ఎక్కువగా అల్లాహ్ కరుణ కటాక్షాలు మొదటి వ్యక్తిపై ప్రసరించాలని అల్లాహ్‌తో వేడుకుంటాడు. పలకరింపుకు ఉన్న విలువ ఇది.

దైవప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా అన్నారు :

ఒక ముస్లింపై మరో ముస్లింకు ఐదు హక్కులు ఉన్నాయి.

1) సలామ్‌కు జవాబు ఇవ్వడం 2) వ్యాధిగ్రస్తుడిని పరామర్శిం చడం 3) జనాజా (శవయాత్ర) వెంట వెళ్లడం 4) విందు ఆహ్వానాన్ని అంగీకరించటం 5) తుమ్ముకు జవాబివ్వడం.

పలకరించడమనే సమస్య నేడు ఇళ్ళల్లో వృద్ధులు విపరీతంగా

ఎదుర్కొంటున్నారు. తమ జీవితమంతా కుటుంబం కోసం, పిల్లల కోసం వెచ్చించి వృద్ధాప్యంలో ఏమి చేయలేని స్థితిలో ఇంట్లో ఉన్న పెద్దల్ని పనికిరాని వస్తువుల్ని చూసినట్లు చూస్తున్నారు. వారి శ్రమ ఫలితమే మనం అనుభవిస్తున్నాం అని మరిచిపోతున్నారు.

అలాంటి పెద్దలను ఆప్యాయంగా పలకరించాలి, ఒక మాట మాట్లాడాలి. ఒక్కసారి పలకరింపుతో వాళ్ళను కదిపి చూడండి బండెడు అనుభవాలు మీముందుంచుతారు. పలకరింపు పెద్దలకు ఆరోగ్యాన్నిచ్చే మందులా పనిచేస్తుంది. పెద్దలనే కాదు ఎవరినైనా పలకరిస్తూ ఉండాలి. దానితో స్నేహం, ప్రేమ, బంధం, అనుబంధం పెరుగుతూ ఉంటుంది. డబ్బు మాత్రమే ముఖ్యంగా మారిన నేటి తరాలకు మనుషుల మధ్య సంబంధాలు అప్రధానమైన పరిస్థితులు వచ్చాయి.

ఒక పెద్దాయన అన్ని హంగులతో తాను, తన భార్యాబిడ్డలతో ఏసీ లాంటి సకల సౌకర్యాలు అనుభవిస్తూ వృద్ధురాలైన తన తల్లిని మాత్రం ఇంటి బయటి గదిలో ఉంచాడు. అప్పుడు ఆ తల్లి తన కొడుకుతో ఇలా అన్నది : నాకేమీ తిండి పెట్టాల్సిన అవసరం లేదు, నేనేమి అడగటమూ లేదు. ఏం చేస్తున్నావమ్మా, ఏం తిన్నావు, బాగున్నావా అని రోజూ నన్ను అడిగితే చాలు అని ఆ తల్లి చెబుతూ దుఃఖించింది. అంటే, పలకరింపు విలువేమిటో అర్థం చేసుకోవచ్చు.

లాక్‌డౌన్ మూలాన ఇంట్లోనే అందరూ ఉన్నప్పటికీ వారి మధ్య దూరాలేవి తగ్గలేదు. మరింత పెరుగుతూనే ఉన్నాయి. ఎవరి చేతుల్లో వాళ్ళు సెల్‌ఫోన్‌లతో గడిపే శారు. కుటుంబ సంబంధాల్లో పలకరింపు లేని విపరీత దూరాలు పెరిగాయి. అన్నీ బాగున్నప్పుడు పలకరించినా, పలకరించ పోయినా పర్లేదు. కానీ బాధల్లో ఉన్నప్పుడు మాత్రం తప్పకుండా వెళ్లి పలకరించండి. అదే మన బంధానికి ఇచ్చే విలువ.

ఒక్క పలకరింపుతో నూతనోత్తేజమేదో తొంగి చూస్తుంటుంది. పలకరింపు అనేది మనిషి మంచితనానికి నిదర్శనంగా నిలుస్తుంది. నేటి అత్యంత ఆధునిక సౌకర్యాలు, విలాసాలు అనుభవిస్తున్న కాలంలో మనం పోగొట్టుకుంటున్న గొప్ప మానవాంశం పలకరింపు. పలకరింపు చాలా చిన్న విషయంగానే అనిపించవచ్చు. ఒక చిన్నమాటే పలకరింపై వెలగవచ్చు. ఒక ప్రాణాన్ని నిలబెట్టవచ్చు. ఒక బాధని తొలగించవచ్చు, ఒక ఆలోచనను రేకెత్తించవచ్చు. ఒక ఆశను చిగురింప చేయవచ్చు, మనసు గాయాలను మాన్పించవచ్చు. పలకరింపుకు అంత శక్తి ఉంది. మనలో మనకు పలకరింపులు లేకపోతే అనుబంధాలు ఉండవు. మనం ఒకరిని ఒకరు గౌరవించుకోకపోతే ప్రేమలుండవు.

ఏ బంధమైనా బలంగా ఉండాలన్నా, బాగుండాలన్నా ముందుగా పలకరింపు ఉండాలి. ఆత్మీయ పలకరింపుకు ఖర్చేమీ లేదు. ఒక చిరునవ్వు, ఒక మాట తప్ప. మానవ సంబంధాలలో చాలామంది బంధువులు, మిత్రులు, ఆత్మీయులైనా ఒకసారి ఆత్మీయ పలకరింపు అవసరం. మనసుల్లో దాగిన భావాలు, అభిప్రాయాలు, పలకరించి అడిగితేనే తెలుస్తాయి. కుటుంబంలోనే కాదు, ఇంటి పక్కన వాళ్లని, దూరాన ఉన్న మిత్రులను కొంచెం సమయం కేటాయించి పలకరించండి. కొంతమంది మన పలకరింపు కోసం ఎదురుచూసేవారు ఉంటారు. మన పలకరింపు కోసం పడిగాపులు కాస్తారంటే నమ్ముతారా? వారే మన మనసుకి నచ్చినవారు. వారు బంధువుల్లోనూ ఉండొచ్చు, స్నేహితుల్లోనూ ఉండొచ్చు. మనం ఎంత బిజీగా ఉన్నా వారానికో, నెలకో ఒకసారి పలకరిస్తే మానవ సంబంధాలు బాగుంటాయి.

ప్రేమగా పలకరిస్తే పరాయి వాళ్ళు కూడా అయినవాళ్లు అవుతారు. కఠినంగా మాట్లాడితే అయినవాళ్ళు కూడా దూరం అవుతారు. అందుకే అందరినీ ప్రేమగా పలుకరిద్దాం. పలుకేమీ బంగారం కాదు కదా! ❖


## ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

ఉచితంగా దివ్యఖుర్‌ఆన్ కోసం సంప్రదించండి:

**1800 572 3000**



# మతతత్వ మురికిలో సినిమా!

- కవి కరీముల్లా

**ఒకానొకప్పుడు** తెలుగు సినిమా ప్రగతిశీల భావాలకు నెలవుగా ఉండేది. సామాజిక రుగ్మతలపై ప్రజల్ని చైతన్య వంతుల్ని చేసే సాధనంగా కొనియాడబడేది. కానీ నేడు అదే సినిమా మానవ సంబంధాలకు విఘాతం కలిగిస్తూ, మానవీయ విలువలకు పాతర వేస్తూ, సాంస్కృతిక కాలుష్యాన్ని పెంచుతూ సమాజంలో అనైక్యతకు, ముస్లింలపై ద్వేషం పెంచే మతతత్వ ఫాసిస్టు పోకడలకు బాటలు వేస్తుంది. మొత్తం సినిమా రంగమంతా కాకపోయినా తులసి వనంలో గంజాయి మొక్కల్లాంటి కొందరు మతపిచ్చి నటులు, దర్శకులు, నిర్మాతలు, మాటల రచయితల వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొంది.

ముఖ్యంగా సమాజంలో అతిపెద్ద మైనార్టీ సమాజమైన ముస్లింల మనోభావాలకు వీసమెత్తు విలువ ఇవ్వకుండా దేశద్రోహులుగా, ఖూనీకోర్లుగా చిత్రీకరిస్తూ ఇతర వర్గాల్లో ముస్లిం వ్యతిరేకత పెంచే ఫాసిస్టు కుట్రలకు పాల్పడుతు న్నారు. దేశభక్తి ముసుగులో ముస్లిం ద్వేషం ఇతివృత్తాలు నిర్మిస్తూ లౌకిక వ్యవస్థకే గొడ్డలిపెట్టులా మారటం దురదృష్ట కరం. ఓ వైపు బతుకు పోరాటంలో ఎన్నో సమస్యలతో కునారిల్లుతూ శ్రామిక జీవన సంస్కృతి కలిగి దేశ ఉత్పత్తి రంగంలో ప్రధాన శ్రమశక్తిగా ఉన్న ముస్లింలు నేడు తెలుగు సినిమా చూడాలంటేనే భయపడే పరిస్థితి దాపురించింది. అదేమంటే చూపించవల్సిన ఫ్యాక్షన్ అంతా చూపించి చివరిలో ఫ్యాక్షన్ తప్పు అని సందేశం ఇచ్చినట్టు ఒక మంచి ముస్లిం క్యారెక్టర్ కూడా పెట్టాం కదా! అని అంటారు. ఇటువంటి కుత్సితమైన మతతత్వ పూరితమైన ఆలోచనలు సినీ పరిశ్రమకు, సమాజానికి మరింత హాని చేసేవే కానీ మేలు చేసేవి కావు. ఈ మధ్య వచ్చిన యానిమల్ సినిమాలో బురఖా వేసుకొని ముస్లిం స్త్రీలు సిగరెట్ తాగుతున్నట్టు చూపారు. విలన్ ముస్లిం క్యారెక్టర్ను పెట్టి చాలా జుగుప్స చూపించారు. గర్భంతో ఉన్న ముస్లిం స్త్రీని (విలన్ భార్య) శత్రువు భార్య కదా చంపేసేయండి అని హీరో అంటాడు. 'పోలీస్ కమీషనర్' అనే సినిమాలో హీరో ఓ ముస్లిం క్యారెక్టర్ను 'రేయ్ తురకోడా' అని పిలుస్తాడు. 'ఖడ్గం' సినిమాలో హీరో టోపీ గడ్డం ఉన్న విలన్ను హిందూ దేవతా

విగ్రహం ఉన్న గుడికేసి తల మోది చంపుతాడు. పాకిస్తాన్ క్రికెట్లో గెలిస్తే ముస్లింలంతా స్వీట్స్ పంచుకుని ఆనందించినట్లు చూపిస్తాడు. వీటివల్ల సినిమా సంచలనాలు నమోదు చేసుకుని పది కాసులు సంపాదించి పెడితే పెడ్తుందేమో కానీ సమాజానికి ఎంత హాని చేస్తుందో వేరే చెప్పనక్కరలేదు. అయినా ఈ దేశం కోసం రక్తతర్పణ చేసిన ముస్లింల త్యాగాలు ఒక చరిత్ర కాలేకపోయిన చోట ఇంతకన్నా మంచి సినిమాలు వస్తాయని ఆశించడం భంగపాటే అవుతుంది. పైసల కోసం మానవ విలువల్ని, వలువల్ని దిగజార్చేవాళ్ళకు దేశభక్తిని గురించి మాట్లాడే అర్హతే లేదు. ఒక ముస్లిం తన సమస్యల్ని మర్చిపోయి అందరిలా కాసింత వినోదం కోసం థియేటర్‌కు వెళితే ప్రతి రీలు నీతిలేని ఖడ్గమై కుళ్ళబొడుస్తుంది. ఇలా ఓ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వేధించటంలో తెలుగు సినిమా శాడిజం పరాకాష్టకు చేరుకుంది. మరో దృష్టి కోణం నుండి పరిశీలిస్తే ముస్లిం స్త్రీల జీవితాల్ని అపహాస్యం పాలు చేసే సినిమాలు వస్తున్నాయి. ఒక ముస్లిం స్త్రీ (హీరోయిన్) బురఖా లాగుతూ హీరో వెకిలి చేష్టలు (దర్శకుడి దృష్టిలో ప్రేమ) చేస్తుంటాడు. ఇలాంటి సన్నివేశాలు చిత్రీకరించటం ద్వారా వీళ్ళు సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో ఫాసిజం ఆలోచన విధానం అవగాహన చేసుకున్న వారెవరికైనా తెలుస్తుంది. ఇలాంటి సందేశాలే ఒక రకంగా ఆయేషామీరా హత్యకు కారణం అయ్యాయని ఎవరైనా అంటే తప్పు పట్టవల్సిన అవసరం లేదు.

కులం కంపులో కుళ్ళిపోతూ, మతతత్వ రొచ్చులో పొర్లాడుతూ సినిమా సగటు ప్రేక్షకులకు జుగుప్స కలిగిస్తుంది. తెలుగు సినిమాలో విప్లవ సినిమాలు తీస్తున్నామని చెప్పుకుంటున్న వారి పరిస్థితి సైతం ఇందుకు భిన్నంగా లేదు. వీరికి ముస్లింల జీవితాలు, అభద్రతా భావం, అస్తిత్వ భయాలు ఎప్పుడూ ఇతివృత్తంగా కన్పించలేదు. సమాజంలోని పీడితుడు హిందువైనా, ముస్లిమైనా అతని పక్షం వహించేవాడే నిజమైన కళాకారుడు. అలాకాక సమాజాన్ని ముక్కలు ముక్కలు చేసి మత విద్వేషాలు పెంచాలని చూసేవారు కళాకారులుగా కాక కళా సైతానులుగా మిగిలిపోతారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదం, దేశీయంగా మతతత్వ ఫాసిజం బుసలు కొడ్తున్న ఈ సందర్భంలో మత సామరస్యాన్ని, నిజమైన దేశ ప్రేమని పెంపొందించే సినిమాలు తీయటం, ప్రోత్సహించటం సినీ నిర్మాణ సంస్థల నైతిక బాధ్యత. అయితే మొత్తం తెలుగు సినీ ప్రపంచం ఇలా కుళ్ళి పోయిందని మనం గుండెలు బాదుకోవల్సిన అవసరం లేదు కానీ కొద్ది మంది వల్ల మొత్తం సినీరంగానికి అప్రతిష్ట రాకుండా జాగ్రత్త పడవల్సిన అవసరం అందరికీ ఉంది.

ప్రపంచ చరిత్రలో ఎంతో విశిష్టమైన భారతీయ సంస్కృతిలో భాగమైన లౌకిక పునాదుల్ని కాపాడుకోవటం అందరి విధి. ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే సాధనంగా, సామరస్య, సహజీవన విలువల్ని పెంపొందించే కళాఖండాల్ని నిర్మిస్తూ విభిన్న వర్గాల వారధిగా తెలుగు సినిమా భవిష్యత్తులో నిలవాలని ఆశిద్దాం..

"సినీ దర్శకుల్లారా!
నలిగి నలిగి నుజ్జయినోడ్ని
బిక్కు బిక్కుమని బ్రతికేటోడ్ని
చించబడ్డ బురఖాల్ని
మూల పడ్డ చరఖాల్ని
దొర్లిపడ్డ మా గడ్డం తలల్ని
బాయ్నెట్ నెత్తుటి వెలల్ని
ఎప్పుడైనా చిత్రించారా?
జీవితాంతం మాతో సాగే
ఆకలి గీతాల్ని
అక్షర క్షయమైన సత్యాల్ని
ఎప్పుడైనా విన్పించారా?
ఇక మీ సినిమా ఉన్మాదం
చూడలేము ఆపండేహె!

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

38 తమ ప్రభువు ఆదేశాలను పాటించేవారు, నమాజ్ స్థాపించేవారు, తమ వ్యవహారాలను పరస్పర సలహా సంప్రతింపులతో నడుపుకునేవారు,[61] మేము వారికి ప్రసాదించిన ఉపాధిలో నుండి ఖర్చుపెట్టేవారు.

**(61వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

మూడు, ఏ వ్యవహారాల సంబంధం ఇతరుల హక్కులు, ప్రయోజనాలతో ముడివడి ఉంటుందో ఆ వ్యవహారాలలో నిర్ణయాలు గైకొనడం చాలా పెద్ద బాధ్యత. దైవానికి భయపడే ఏ వ్యక్తీ, అది దైవం సమక్షంలో ఎంత కఠినమయిన జవాబు దారీ విషయమో తెలిసిన వ్యక్తి ఎన్నటికీ ఈ మహా భారాన్ని తాను ఒంటరిగా తన నెత్తిన వేసుకోవడానికి సాహసించడు. దైవం పట్ల భయంలేని వ్యక్తులు, పరలోకం పట్ల నిశ్చింతగా మెలిగే వ్యక్తులు మటుకే ఇటువంటి దుస్సాహసానికి పాల్పడతారు. దైవభక్తి, పరలోక భీతి గల వ్యక్తి అయితే తప్పనిసరిగా, ఒక సమిష్టి వ్యవహారం ఏ ఏ వ్యక్తులకు సంబంధించినదో వారినందరినీ లేదా వారి విశ్వసనీయులయిన ప్రతినిధుల్ని ఆ నిర్ణయానికి చేసే సలహా సంప్రతింపులలో పాల్గొనేలా చూస్తాడు. తద్వారా ఇతోధికంగా సరయిన, నిష్పక్షపాతమయిన, న్యాయవంతమయిన నిర్ణయంచేయడం సాధ్యమవుతుంది. ఒకవేళ తెలియక ఏదయినా తప్పు జరిగినా కేవలం ఎవరో ఒక వ్యక్తి పైన దాని బాధ్యత రాదు.

ఈ మూడు కారణాలను మనిషి పరిశీలనగా గమనిస్తే ఒక విషయం క్షుణ్ణంగా అర్థమవుతుంది. ఇస్లామ్ ఏ నీతిని మానవునికి బోధిస్తుందో దాని అనివార్యమయిన ఆవశ్యకత సలహా విధానాన్ని పాటించడం. దీన్ని ఉల్లంఘించడం ఒక మహా అనైతిక విధానం దీన్ని ఇస్లామ్ ఎన్నటికీ అనుమతించదు. ఇస్లామీయ జీవన వ్యవస్థ కోరేదేమిటంటే సలహా సంప్రతింపుల సూత్రం ప్రతి చిన్నా పెద్ద సామూహిక వ్యవహారంలో పాటించాలి. ఇంటి వ్యవహారాలయితే భార్యాభర్తలు పరస్పర సంప్రతింపులతో నడచుకోవాలి. పిల్లలు ప్రాజ్ఞులయితే వారినీ సంప్రతింపులలో భాగం పంచివ్వాలి. కుటుంబ వ్యవహారాలయితే అందులో కుటుంబంలోని సమస్త ప్రాజ్ఞులు, వివేకవంతులయిన వ్యక్తులందరి అభిప్రాయాలను సేకరించాలి. ఒక తెగ, సముదాయం, జనావాసం వ్యవహారాలయి నట్లయితే, అందరూ సంప్రతింపులలో పాల్గొనడం సాధ్యం కాకపోతే అటువంటి వ్యవహారాల నిర్ణయం ఏదయినా మండలి, పంచాయితీలో చేయాలి. అందులో అందరూ అంగీకరించిన విధానం రీత్యా, సంబంధిత వ్యక్తులందరి విశ్వాసాన్ని చూరగొన్న ప్రతినిధులు పాల్గొనడం అవసరం. ఒక జాతి మొత్తానికి సంబంధించిన వ్యవహారాలయితే వాటిని నడపడానికి జాతి నాయకుడిని అందరి ఇష్టానుసారంగా నియమించాలి. అతను జాతి వ్యవహారాలను, జాతి విశ్వసనీయులని తలచిన ఆలోచనాపరులయిన వ్యక్తుల అభిప్రాయం, సలహా సంప్రతింపుల ద్వారా నడపాలి. జాతి అతన్ని తన నాయకుడుగా స్వయంగా నిర్ణయించిన కాలం వరకే అతను నాయకుడుగా మెలగాలి. నిజాయితీపరుడయిన ఏ వ్యక్తీ బలవంతాన జాతి నాయకుడవడాన్ని లేదా అలా నాయకుడయి ఉండటాన్ని తానయి కోరిక వెల్లడించడు, దానికి ప్రయత్నమూ చేయడు. అతను తొలుత బలవంతాన జాతిపైన అధీనత వహించి, బలవంతంగా జనుల ఇష్టాన్నీ కోరే వంచనకు కూడా పాల్పడజాలడు. అతను ఎత్తుగడలు వేసి, తనకు సలహాలనిచ్చేందుకు జనులు తమ స్వేచ్ఛాయుత ఇష్టంతో, తమకు నచ్చిన ప్రతినిధుల్ని కాక అతని ఇష్టం ప్రకారం సలహాలనిచ్చే ప్రతినిధుల్ని ఎన్నుకునేలానూ చేయజాలడు. ఇటువంటి ఏ ఇచ్ఛ అయినా సంకల్పశుద్ధి లేని మనసులోనే జనిస్తుంది. ఇటువంటి ఇచ్ఛతో పాటు (తన వ్యవహారాలను సలహా సంప్ర తింపులతో నడుపుకునే వారు) అనే ఆదేశానికి బాహ్యరూపం కల్పించి దాని యదార్థ రూపాన్ని మటుమాయం చేసే ప్రయత్నాలు చేసేవాడు, దైవాన్నీ దైవ దాసులయిన మానవుల్ని వంచించడంలో ఎటువంటి జంకు గొంకులేని వ్యక్తియే కాగలడు. నిజానికి దేవుడూ మోసపోజాలడు, మానవులూ గుడ్డివారు కాజాలరు, పగటి వెలుగులో ఒక వ్యక్తి బహిరంగంగా దోపిడి జరుపుతూ ఉంటే అతను చేసింది దోపిడి కాదు, మానవ సేవ ఒనర్చుతున్నాడు అని మనస్ఫూర్తిగా అనుకునేంత గుడ్డివారుగా మారలేరు మనుషులు.

నియమం స్వయంగా దాని స్వరూప స్వభావాల రీత్యా అయిదు విషయాలను కోరుతుంది:

**(61వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్‌హుమ్) గొప్పదనం

**350)** మహనీయ అలీ(రజి) తెలిపారు: హజ్రత్ ఫాతిమా(రఅ) దైవ ప్రవక్త(స) సమక్షంలో, తిరుగలి రాయి తిప్పటంలో ఎదురవుతున్న బాధను గురించి చెప్పుకున్నారు. ఇలా చెప్పుకున్న కొన్నాళ్ళ తర్వాత దైవప్రవక్త(స) వద్దకు కొంతమంది ఖైదీలు తీసుకురాబడ్డారు. అప్పుడు హజ్రత్ ఫాతిమా(ర.అ) దైవప్రవక్త(స) ఇంటికి వచ్చారు. కాని ఆ సమయంలో దైవప్రవక్త(స) ఇంట్లో లేరు. ఆమె గారు హజ్రత్ ఆయిషా(ర.అ)ను కలుసుకుని, తన సమస్య గురించి చెప్పుకున్నారు. తరువాత దైవప్రవక్త(స) ఇంటికి వచ్చినప్పుడు, ఫాతిమా వచ్చి వెళ్ళిన సంగతిని ఆమె చెప్పారు. అందువల్ల దైవప్రవక్త(స) స్వయంగా మా ఇంటికి వచ్చారు. అప్పటికే మేము పడకపై మేను వాల్చాము. నేను లేచి నిలబడబోయాను. "ఫరవాలేదు. పడుకునే ఉండండి" అని దైవప్రవక్త(స) చెప్పారు. తరువాత ఆయన(స) మా ఇద్దరి మధ్యన కూర్చున్నారు. నేను ఆయన(స) పాదాల చల్లదనాన్ని నా గుండెల్లో ఆస్వాదించాను. ఆయన (స) ఇలా ఉపదేశించారు: "మీరు ఏదైతే నా నుండి కోరారో దానికన్నా మేలైన విషయం చెప్పనా! మీరు నిద్రించడానికి పడకపై మేను వాల్చినప్పుడు 34సార్లు అల్లాహు అక్బర్ అనీ, 33 సార్లు సుబ్‌హానల్లాహ్ అనీ, 33 సార్లు అల్‌హమ్దులిల్లాహ్ అని పలకండి. ఈ ఆచరణ మీ పాలిట సేవకుని కన్నా మేలైనది."[1]

### అధ్యాయం : 11

### మహనీయ జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి) విశిష్టత

**ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఆయనతో, "నీవు రూపురేఖలలోనూ, గుణగణాలలోనూ నన్ను ఎక్కువగా పోలి ఉన్నావ్"[1] అన్నారు.**

**352)** హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: "అబూ హురైరా (రజి) చాలా హదీసులు వినిపిస్తాడని జనులు చెప్పుకుంటున్నారు. నిజానికి నేను కడుపు నిండిన తరువాత ఎల్లవేళలా ప్రవక్త మహనీయుల(సఅసమ్)నే అంటిపెట్టుకుని ఉండేవాణ్ణి.[1] నాకు ఖుమైరీ రొట్టెలుగానీ, నాణ్యమైన దుస్తులుగానీ లభ్యమయ్యేవి కావు (అంటే నా సమయంలో ఎక్కువ భాగం విద్యార్జనలోనే గడిచిపోయేది). నా సేవ కొరకు ఏ పురుషుడుగానీ, ఏ స్త్రీ గానీ వచ్చేవారు కారు. పైగా నేను ఆకలి బాధకు తట్టుకోలేక కడుపుకు రాయి కట్టుకునేవాణ్ణి. ఒక్కోసారి నేను ఏదైనా దివ్య వచనాన్ని పఠించి, దీనికి అర్థం ఏమిటో చెప్పగలరా! అని జనులను అడిగేవాణ్ణి. బహుశా వారు ఆ ఆయత్‌లోని అర్థాన్ని గ్రహించి నన్ను తమ ఇంటికి తోడ్కొని వెళ్ళి అన్నం పెడతారని ఆశించేవాణ్ణి. వాస్తవానికి నాకు ఆ ఆయత్ అర్థం తెలియక కాదు, తెలుసు. కాని ప్రజల దృష్టిని నా వైపు మళ్ళించుకునేందుకు ఆ విధంగా అభినయం చేసేవాణ్ణి. నిరాధార జీవులపట్ల అందరికన్నా ఉత్తమంగా వ్యవహరించేవారిలో ఒకరు హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి). ఆయన మమ్మల్ని తన ఇంటికి పిలుచుకుని వెళ్ళి, ఇంట్లో ఆ సమయానికి ఏముంటే అదే తినిపించేవారు.[2] ఒక్కోసారి (భోజనం లేకపోతే) తేనె కుప్పెగానీ, నేతి కుప్పె గానీ తెచ్చి సమర్పించేవారు. మేము ఆ కుప్పెనే చీల్చి అందలి పదార్థాన్ని చప్పరించేవారం."

350-1. ఎవరయితే నిద్రకు ఉపక్రమించినప్పుడు ఈ హదీసు ప్రకారం అమలుపరుస్తాడో అతనికి అలసట ఉండదని ఇమామ్ ఇబ్నె తైమియ్యా (రహ్మ) అభిప్రాయపడ్డారు.

11-1. ఈయన హజ్రత్ అలీ(రజి) అన్నయ్య. అలీ(రజి) కన్నా పదేండ్ల పెద్దవారు. దైవమార్గంలో రెండు సార్లు హిజ్రత్ చేశారు. మొదటి హిజ్రత్ అబిసీనియా దేశానికి, రెండవ హిజ్రత్ మదీనాకు. ఈయనకు 'జుల్ జనాహైన్' (రెండు రెక్కల వాడు) అనే బిరుదు ఉంది. ఇస్లామ్ స్వీకరిస్తున్నప్పుడు ఈయన దైవప్రవక్త(స)కు ఎడమ వైపున నిలబడి నమాజ్ చేశారు. "నీవు నాతో కలసి నమాజ్ ఆచరించావు. అల్లాహ్ స్వర్గంలో నీకు రెండు రెక్కలను ప్రసాదిస్తాడు. తద్వారా నీవు స్వర్గంలో ఎగురుతూ తిరుగుతావు" అని దైవప్రవక్త(స) చెప్పారు. 41 ఏండ్ల వయసులో హిజ్రీ 8వ యేట-ముతా యుద్ధంలో జాఫర్(రజి) అమరగతి నొందారు.

352-1. అంటే అప్పుడు నాకంటూ ఇల్లూవాకిలి ఉండేది కాదు. దైవ ప్రవక్త(స) సాంగత్య భాగ్యంతోనే పూటకు ఇంత అన్నం దొరికేది.

352-2. మహనీయ జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి)గొప్ప దాతృగుణం కలవారు. ఈయన కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ దాన ధర్మాలైతే విశ్వవిఖ్యాతి గాంచాయి.




### (గత సంచిక తరువాయి)

ఇంకా దూర ప్రయాణాలు పెట్టుకున్న వాళ్ళు ఉంటారు; ట్రైన్, ప్లేన్ బయలు దేరేది మూడు గంటల తర్వాత; ఇప్పుడే స్టేషన్లో ఎయిర్‌పోర్ట్‌లో ఎందుకు వేలాడి పోవడం? అని పనులు మెల్లి మెల్లిగా చేసుకుంటూ ఉంటారు. స్నానాలు త్వరగా ముగించరు. బట్టలు సర్దుకోరు. అసలు ఏ పెట్టిలో బట్టలు పెట్టుకోవాలో లగేజ్ ఎంత తీసుకెళ్ళాలో కూడా చివరి వరకు ప్లాన్ చేసేవాళ్ళు ఉండరు. చివరకు మనం ఎక్కిన క్యాబ్ ట్రాఫిక్ జామ్లో ఇరుక్కుని స్టేషన్కు మనం చేరి ప్లాట్ ఫారంలు దాటుకుంటూ వెతుక్కుని వెళ్లేసరికి ట్రైన్ కదులుతూ ఉండటం జరుగుతుంది. ఎందుకు ఇలా ప్రయాస ప్రయాణం చేస్తున్నాం? ఒక గంట ముందే స్టేషన్లో ఉండేటట్టు చూసుకుంటే కొంప ఏం మునిగిపోతుంది? ఏదైనా జరగరానిది జరిగి ఏ కాళ్ళు విరగడమో జరిగితే ఎలా? ఒక్కోసారి ఆలస్యం ప్రాణానికే ప్రమాదం అని తెలుసుకోవాలి. ఇంకెంత మంది పిల్లలతో బయలుదేరి ఎవరు లోపలికి ఎక్కారో ఏ పెట్టిలో ఎక్కారో తెలియని అయోమయ పరిస్థితి.

### ఆలస్యం అమృతం విషం

కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదు అనే కొంతమంది తల్లిదండ్రులు కూడా పిల్లల పెళ్లిళ్ళ విషయంలో తాత్సారం చేస్తూ ఉంటారు. ఇప్పుడే ఏం తొందరా? అని అలసత్వం చూపిస్తూ ఉంటారు. పంట గానీ, ఫలం గానీ కోతకొచ్చిన తర్వాత కొయ్యక పోతే ఎలాగైతే ఎండ, వాన, గాలి, పురుగులు, పక్షులు దాన్ని పాడు చేసేస్తాయో- పెళ్లీడుకొచ్చిన అమ్మాయినిగాని, అబ్బాయినిగాని సమయానికి పెళ్లి చేయకపోతే - అంతర్జాల (Internet) రూపం లోనూ, మానవ రూపేణా మృగాల రూపంలోనూ కాళనాగులు అనేకం కాటేసేం దుకు కాచుకొని ఉంటాయన్న ఎరుక నేటి తల్లిదండ్రులకు ఎంతో అవసరం.

ప్రవక్త(స) ఇలా హెచ్చరించారు: మీకు నచ్చిన ధర్మపరాయణత, మీరు మెచ్చిన ఉత్తమ గుణగణాలు గల వ్యక్తి - మీ వద్దకు పెళ్లి సంబంధం తీసుకొస్తే అతనికి లేదా ఆమెకి ఇచ్చి పెళ్లి చేసేయండి. మీరు అలా చేయకపోతే, భూమిపై కలహాలు, విస్తృతమైన ఉపద్రవాలు చోటు చేసుకుంటాయి. (తిర్మిజీ)

ఇంకొంతమంది ఉద్యోగాలు చేసుకుంటూ సంపాదనలో పడి ముందు ఇంట్లో అన్ని వస్తువులు సమకూర్చుకున్నాకనే ఆ విషయం ఆలోచిద్దాం అనుకునే వారూ ఉంటారు. అటువంటి వారిలో ఒక కారు, ఇల్లు కూడా పెళ్ళికి ముందే ఉండాలని అనుకోవడం ఇప్పుడు చాలా మంది విషయంలో జరుగుతోంది.

ప్రవక్త (స) ఇలా హితవు పలికారు: యువకుల్లారా! శక్తి గలవారు వెంటనే వివాహం చేసుకోవాలి. అది చూపులను చెడు నుండి ఆపుతుంది, శీలాన్ని కాపాడుతుంది. లైంగిక వాంఛను అదుపులో ఉంచుతుంది. (బుఖారీ, ముస్లిం)

ఇక నూతన దంపతులు పిల్లల విషయంలో "మేము ఇప్పుడే వద్దనుకుంటున్నాం" అంటూ కొన్నాళ్ళు జాలీగా గడిపేస్తారు. ఆ తర్వాత పిల్లల కోసం డాక్టర్ల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతుండే వాళ్ళను చాలామందిని చూస్తూనే ఉన్నాం. ఇలా కొన్నాళు గ్యాప్ ఇవ్వడం వల్ల కూడా జీవక్రియలో మార్పులు వచ్చి సంతానోత్పత్తికి సంబంధించిన కణాలు తగ్గి పిల్లలు కలిగే అవకాశాలు సన్నగిల్లుతాయి అని కొన్ని సర్వేలు చెపుతున్నాయి..

## వయసు మీద పడిన వారికో హెచ్చరిక

45, అరవై సంవత్సరాలు దాటిన స్త్రీ అయినా పురుషులైనా ఏదో ఒక అనారోగ్య సమస్య తప్పడం లేదు. అయితే చాలా మంది వాటిని సీరియస్‌గా తీసుకోకుండా మెడికల్ షాపుల కెళ్ళి వాళ్ళిచ్చిన మందులతో కాలక్షేపం చేస్తూ ఉండటం చూస్తూ ఉంటాం. అవి చాలాసార్లు వికటించి వేరే రోగాలకు దారి తీయడమో లేదా ఉన్న రోగాల తీవ్రత మరింత పెరగడమో జరుగుతూ వుంటుంది. అలాగే ట్రైనింగ్ దశలో ఉన్న మేల్ లేదా ఫిమేల్ నర్సు సలహాలు కూడా చాలా మంది పాటించి ప్రాణాల మీదికి తెచ్చేసుకుంటూ ఉంటారు. ఇప్పుడు ఒక వయసు వచ్చిన వారికి ఏదో రకంగా ఇన్సూరెన్స్ ఉండటం జరుగుతున్నదే. అటువంటి వారు సంవత్సరానికి ఒకసారి పూర్తి మాస్టర్ చెక్ అప్ చేయించుకుంటే రాబోయే రుగ్మతలను అరికట్టే విషయంలో కాని, ఉన్న రోగాలను కనిపెట్టి సకాలంలో వాటికి నివారణోపాయాలను చూపే అవకాశం ఉంది. ఇప్పుడు చెప్పుకున్నవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఏదైనా ఆలస్యం చేస్తే అమృతం కూడా విషం అవుతుందన్న సామెత చాలా విషయాలలో వర్తిస్తుంది.

## తొందరపాటు మంచిది కాదు

మనిషి తన దైనందిన కృత్యాల్లోను, వివిధ కార్యక్రమ ప్రణాళికా రచనలోను రెండు సూత్రాలను ప్రధానంగా గుర్తుకు తెచ్చుకుంటాడు. 'ఆలస్యం అమృతం విషం' అని, 'నిదానమే ప్రధానం' అని... నిజానికి ఈ రెండు సూత్రాలూ కార్యసిద్ధికి అవసరమైనవే. ఆయా సందర్భాలు, సన్నివేశాలు, పరిస్థితులను బట్టి ఈ సూత్రాలను ఆచరణలోకి తేవాల్సి ఉంటుంది.

ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు తన బుద్ధితోనే గాక, తన హితం కోరేవారు, ఆత్మీయుల బుద్ధిని కూడా ఉపయోగించుకోవడం పురోగతి కోరుకునేవాడి లక్షణం. తనకు తోచిందే సరైనదని వెనకా ముందూ ఆలోచించకుండా అనుకున్న వెంటనే పని మొదలెట్టడం వైఫల్యానికి, అవమానానికి కారణభూతమవుతుంది. విపరీత ఫలితాలు ఎదుర్కొన్నాక పశ్చాత్తాపం చెందడం చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే అవుతుంది. ఈ తొందరపాటు ప్రతి మనిషి జీవితంలోనూ కనిపిస్తుంది. అదే శోక కారణమవుతుంది. అనుభవజ్ఞుల సలహాలు, సూచనలను విని విశ్లేషించుకుని అహంకరించక, వివేకంతో ముందడుగేసేవాడు కచ్చితంగా కార్యసాధకుడు కాగలడు.

తొందరపాటు వల్ల జీవితంలో దిద్దుకోలేని అగచాట్లు ఎదురవుతాయి. నిరంతరం దుఃఖం అనుభవించే సంఘటనలూ జరుగుతుంటాయి. ప్రధానంగా కామ, క్రోధ, లోభ, మోహాది అరిషడ్వర్గాల వల్ల, మానసిక ఒత్తిళ్ల వల్ల, భావోద్వేగాలకు బానిస కావడం వల్ల తొందరపాటుతో తప్పులు దొర్లుతుంటాయి. ఈ బలహీనతలను అధిగమించి, వివేకంతో సంయమనంతో సమయజ్ఞతతో వ్యవహరించే వాడెప్పుడూ విజేతే అవుతాడు. ఏ పని ముందు, ఏ పని తరువాత అని ప్రశ్నించుకుంటూ ప్రవర్తించడమే విజ్ఞుల లక్షణం.

చిన్న చిన్న కారణాలకే దంపతులు విడాకులు తీసుకోవడం, యువత ఆత్మహత్యలకు పాల్పడటం తొందరపాటు వల్లనే. కొన్ని క్షణాలు ఆలోచించి 'ఇలా చేయడం అవసరమా?' అని మనసులో నిదానంగా విశ్లేషించుకుంటే ఇటువంటి అనర్థాలే జరగవు. ప్రతిదానికీ విపరీతమైన స్పందన, అసందర్భమైన ఉద్రేకం మనిషిని వివేకహీనుణ్ని చేసి దుశ్చర్యలకు ప్రేరేపిస్తుంది. ఆధ్యాత్మిక శక్తిగల సాధకుడు తొందరపడి అనుచిత నిర్ణయాలు తీసుకోడు. 'ఉరకకు, ఉరకకు మనసా, ఉరికితే దొరకదు హంస' అన్నారు. ఆలోచన లేని ఆచరణ జీను లేని గుర్రం లాంటిది. ప్రణాళిక లేని కార్యం మొదలు పెట్టడమంటే లోతు తెలియని నీళ్లలో దూకడం లాంటిది. కొద్దిపాటి తొందరపాటే కొండంత సమస్యకు దారి తీస్తుంది. మనిషి వినడంలో తొందరపడవచ్చు. అవగాహన చేసుకోవడంలో తొందర పడకూడదు. తొందరపాటు శత్రువుకంటే ప్రమాదకరం!

ప్రవక్త(స) ఇలా అన్నారు: "సహనం, నెమ్మది, హుందాగా వ్యవహరించడం అల్లాహ్ అనుగ్రహం. తొందరపాటు షైతాన్ తరఫు నుండి." (అబూ యాలా)

మంచి విషయాల్లో తొందర విషయం ఎలా ఉన్నా, చెడు విషయాలలో అసలు మంచిది కాదు. కొన్ని సందర్భాలలో మంచి విషయాలలో కూడా తొందరపాటు మంచిది కాదు. ఉదాహరణకు నమాజు, ఖురాన్ పారాయణం మొదలైనవి..

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ కొత్త సంవత్సరంలో - మనల్ని మనం సరికొత్తగా ఆవిష్కరించుకోవాలంటే- అల్లాహ్ ఈ ఆదేశమే మనందరికీ శిరోధార్యం!

కనుక ప్రవక్తకు విధేయులయితేనే మీరు సన్మార్గం పొందుతారు. ప్రవక్త బాధ్యతల్లా (దైవసందేశాన్ని) స్పష్టంగా అందజేయడం వరకే." (నూర్: 54)

# అనుభూతులు ఆలోచనల అద్భుత కవనం

- వాహెద్

**'మచ్చు తునకలు'** పేరుతో గీటురాయి సంపాదకులు మలిక్ ఇంతకు ముందు ప్రచురించిన కవిత్వ సంపుటి చాలా మంది చదివే ఉంటారు. తనదైన శైలిలో పాఠకుల మనసును, మెదడును రెంటినీ అలజడికి గురిచేసి భావోద్వేగాల తుఫానులో ముంచేసే కవిత్వమది.

ఇప్పుడు మరో కవిత్వ సంపుటి 'కొత్త తునకలు' మలిక్ గారి కలం నుంచి పాఠకుల వద్దకు రాబోతోంది. ఈ పుస్తకానికి సమీక్ష రాయగలనో లేదో తెలియదు, నా గురువు గారి పుస్తకానికి పరామర్శ చేసే స్థాయి నాకు లేదు, కేవలం పరిచయం చేయగలను.

ఈ పుస్తకాన్ని తెరిచి కొంత చదివిన తర్వాత ఒక ఫార్సీ కవిత గుర్తుకు వచ్చింది -

"నా గుండెబాధ వరకు నువ్వు ఎప్పుడు చేరగలవో తెలుసా?

నువ్వు కలమెత్తి కాగితంపై నెత్తుటితో రాసినప్పుడు చేరగలవు"

ఈ కవిత్వ సంపుటిలో సుల్తాన్ ముహియుద్దీన్ మలిక్ రాసిన అక్షరాల్లో దాగిన హృదయ వ్యధను అందుకోగలనా? కలమెత్తి రాయడం అందరం చేస్తునే ఉన్నాం. కాని కాగితంపై గుండెనే కలంగా మార్చి రుధిరధారలే సిరాగా రాయగలిగే స్థాయికి చేరుకోగలనా?

'ఓ కవిత కథ' పేరుతో ఆయన రాసిన కవిత చదివితే మలిక్ కవిత్వ మ్యానిఫెస్టో ఏమిటో మనకు అర్థమవుతుంది.



'ఆంతర్యంలో విజృంభించిన
ఘోషణల సారాంశమే
మార్మోగే
కవితాధార సరిగమల నా
విస్తృత విన్యాసాలు

..................................

.......................................

ఆత్మకూ మనసుకూ అనుబంధం

గుసగుసలాడే దడదడ తోటే

నవనవలాడే కనకనమాడే

కవన కథనానికి ప్రథమ ప్రస్తావన

గుండెకూ గళానికి కలానికీ కాగితానికీ

నెత్తురుకూ సత్తువకూ సత్యానికీ సంబంధం?

రగులుతున్న నెత్తురు ఉన్నంత కాలం

పగుళ్ళున్న రక్తసిక్తమయిన పెదాలుండనే

ఉంటాయట

..........................

.........................

ఈ కవిత పూర్తిగా చదివితే మలిక్ కవిత్వమేమిటో మనకు అర్థమవుతుంది. కవిత్వం ఆత్మాశ్రయమా, ప్రజాప్రయోజనమా అన్న ప్రశ్నలకు కూడా జవాబులు దొరుకుతాయి.

రగోం మే దౌడ్ తే ఫిర్నే కె నహీ హమ్ ఖాయల్
జబ్ ఆంఖ్ హీ సె న టపకాతొ ఫిర్ లహూ క్యా హై

అంటాడు గాలిబ్. నెత్తరు శరీరంలో ఉన్నది కేవలం నరనరాల్లో ప్రవహించడానికి మాత్రమే కాదు, కంటి నుంచి రాలకపోతే నెత్తురు దేనికి. నెత్తుటి ధర్మాన్ని నిర్వచించిందే మలిక్ కవిత్వం.

Poetry is the spontaneous overflow of powerful feelings: it takes its origins from emotion recollected in tranquillity. అన్నాడు వర్డ్స్ వర్త్.

'కవనం' పేరుతో రాసిన కవితలో మలిక్ గారేమన్నారో చూడండి.

'మాటల ఖజానాలు ప్రోగుచేసి మోయలేదెన్నడూ తత్ క్షణ

సృజన శకలాలే సమస్తం

ఎప్పుడయినా, ఎన్నడయినా''

స్పాంటేనియస్ ఓవర్ ఫ్లో అనే మాట ఎంత నిజమో.... ఇమోషన్స్ రికలెక్టెడ్ ఇన్ ట్రాంక్విలిటీ అనే మాట కూడా అంతే నిజం. వర్డ్స్ వర్త్ కవిత్వం ఎలా జనిస్తుందో చెప్పిన మాట మలిక్ కవిత్వ

## తేటగజల్-1

గుండెపేర్చిన నిప్పుకొండ
నిండగానే మండవలెనా?
కంటినుండి ఎగిసిపారే
నీటిపుట్టకు ఆరవలెనా??
    జాలి తెలియని చుట్టుప్రక్కల
    మేలి ముసుగుతో మెలగవలెనా?
    కొంపలార్పే తోటివారికి
    సొంపుగా ఎద చూపవలెనా??
బండలయినా పిండి అయ్యే
గండమే ఈ బ్రతుకుబాట
గుండెకాయను పిండివేసే
గండుచేతల మరువవలెనా?
    గాలి సోకితె పెకిలిపోయే
    కలపమొక్కగ కాదు బ్రతుకు
    గుట్టలను పెకిలించగలిగే
    దిట్టయే తుదముట్టవలెనా?
ఊడలన్నీ వేరులయితే
వాడిగాలులు కదపలేవు
మర్రి బ్రతుకే సాగవలెనా?
వెర్రిమొర్రిగ ముగియవలెనా??

## సామరస్య సంధాన కేతని

జమాఅతె ఇస్లామీ హింద్
దైవ ధర్మ సంస్థాపనానికి
    పీడిత జన సేవా పరాయణి
    దళిత జనావళి ఆర్తనినాదిని
    నవసమాజ నిర్మాణ ప్రణాళి
    ధర్మమార్గ సందేశ ప్రదాయి
మానవ జీవన గమ్య దర్శిని
క్రాంతిమార్గ సంకేత ప్రకాశిని
ధర్మగ్రంథ బోధామృత వాహిని
విశ్వనేత ఉపదేశ ప్రచారిణి
    వర్ణ వర్గ వైషమ్య వినాశిని
    భాషా ప్రాంత వివాద నివారిణి
    మానవ ఏకత ధర్మ ప్రబోధిని
    సామరస్య సంధానకేతని
ఉన్నత నైతిక మూల్య శోభితం
ప్రేమ పూరిత రాగరంజితం
కరుణపూర్వ సౌభ్రాత్ర ప్రధానం
జమాత్ నీతి ధర్మ పేరితం
    మార్దవమానస సుమధుర గానం
    ఆత్మవికాసం జ్ఞానాభ్యుదయం
    కార్యశీల ఆచరణయోజనం
    జమాఅత్ ఘోషణ విప్లవవాదం

సృజన తీరు గురించి రాసిన మాటలను ఒక సారి తూకమేసి చూసుకుంటే కవులకు మార్గదర్శక సూచనలు కనిపిస్తాయి.

'అరాచకం కొండలయి' అనే కవితను కూడా ఇక్కడ కోట్ చేయడం సముచితంగా ఉంటుంది.

'కవితలు కొండలయి
వెండి ఏరులయ్యాయి
జగమెల్లా ఆవహించాయి
నలుదిశలా వ్యాపించాయి
సంగీత సాగర తరంగాలయి
మనోజగత్తులో మార్మోగాయి'

ఈ కవితలో కవిత్వ నిర్మాణం గురించి చర్చిస్తే... వెండి ఏరులయ్యాయి అనే ప్రయోగం అద్భుతమైన భావచిత్రాన్ని ఆవిష్క

రిస్తుంది. ఇక్కడ నీటిని వెండితో పోల్చడం మాత్రమే లేదు, నీటిపై పడి మెరిసే సూర్యకిరణాలను కూడా భావ చిత్రంలో తీసుకు రావడం గమనించవచ్చు. అలాగే కవితలు కొండలయి అని అంతకు ముందు చెప్పిన వాక్యంలో కూడా ఇలాంటి భావచిత్రమే ఉంది. కాని ఈ రెండిటి మధ్య ఉన్న తేడాపై దృష్టి పెట్టాలి. కొండ అనేది అర్థపరంగా చాలా బరువైనది అనే ఒక అమూర్త భావనను ఇస్తుంది. కవితను కొండగా చెప్పడమంటే చాలా భారమైన మనోవేదన, లేదా మనోభావన లేదా మానసిక స్థితి దీన్ని పాఠకుడు తన ఊహాశక్తితో ఎలాంటి అర్థాలైనా కల్పించు కోవచ్చు. కాని వెంటనే విరోధాభాస వస్తోంది. వెండి ఏరుగా చెప్పడం. ఏరు వేగానికి, ప్రవాహానికి, ఉరవడికి సూచన. ఒక భారమైన అమూర్తభావనను ధ్రువీకృతం చేయడం గమనించ దగింది. ప్రతీకలు, ఉపమానాలు, ఉపమేయాలు, రూపకాలు, భావచిత్రాలు ... మలిక్ కవిత్వంలో అలవోకగా, అద్భుతంగా కవిత్వంలో ఒదిగిపోతాయి.

ఈ కవిత గురించి మరికాస్త ఆలోచిస్తే ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన ఒక కవిత తప్పక గుర్తుకు వస్తుంది.

కరే నా జగ్ మె అలావ్ తో షేర్ కిస్ మక్సద్

కరే న షహర్ మె జల్ థల్ తో చష్మ్ నమ్ క్యా హై

మంట పుట్టించకపోతే కవిత దేనికి. జలప్రళయం రాకపోతే కన్నీరు దేనికి.

కవిత్వానికి నిర్వచనాలు ఎవరైనా ఇవ్వాలనుకుంటే ఇలాంటి కవితలు చాలు.

కవులేం చేస్తారు అని శివారెడ్డి ఒక చక్కని కవిత రాశారు.

"కవులేం చేస్తారు
గోడలకు నోరిస్తారు
చెట్లకు కళ్ళిస్తారు, గాలికి గొంతిస్తారు.
ప్రభుత్వాల్ని ధిక్కరిస్తారు
ప్రజలకు చేతులిస్తారు
తెల్ల కాయితానికి అనంత శక్తినిస్తారు"

కవులేం చేస్తారో ఇటలీకి చెందిన కవి, నోబెల్ బహుమతి గ్రహీత సాల్వటోర్ కాసిమోడో కూడా చెప్పాడు.

The politician wants men to know how to die courageously;

the poet wants men to live courageously.

ఈ రెండు మాటల్లోను సామ్యం ఏమిటంటే, కవిత్వం ప్రజల గొంతుకవ్వాలని చెప్పడం. ధైర్యంగా బతకడం గురించి కాసిమోడో చెప్పిన మాటల్లో కాని, శివారెడ్డి వాక్యాల్లో కాని రాజకీయ కవిత్వం గురించిన సూచనలే ఉన్నాయి. ఇరాక్ యుద్ధం ఆ తర్వాత అమెరికా సమాజంలో కవిత్వం రాజకీయం అనే చర్చ మరోసారి జరిగింది. ఇక్కడ కూడా అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడిన తర్వాత కవిత్వం రాజకీయం అనే చర్చ జరుగుతూనే ఉంది. మధ్యప్రాచ్యానికి చెందిన బద్ర్ షాకిరుల్ సయ్యాబ్, నిజార్ అల్ ఖబ్బానీ, మహ్మూద్ దుర్వేష్ వంటి కవులు ప్రజల బాధలను, ప్రజాసమస్యలనే కవిత్వంగా మలిచారు.

ఇంగ్లీషు కవి డబ్ల్యు.హెచ్. ఆడెన్ గురించి చాలా మందికి తెలిసే ఉంటుంది. ఆయన 1939లో స్పెయిన్ వెళ్ళి అంతర్యుద్ధంలో పాల్గొన్న కవి. కాని ఆయన కూడా కవిత్వాన్ని రాజకీయాలతో ముడిపెట్టడాన్ని తర్వాత ఒప్పుకోలేదు. ఆయన రాసిన ఎలిజీ ఫర్ ఈట్స్ చివరి పంక్తులు గమనించదగినవి.

In the deserts of the heart

Let the healing fountain start,

In the prison of his days

Teach the free man how to praise

షెల్లీ రెండువందల సంవత్సరాల క్రితం unacknowledged legislators of the world అని చెప్పిన మాట కూడా ఉంది. ఆడెన్, షెల్లీలు చెప్పిన మాటల నేపథ్యంలో కవిత్వ ప్రయోజనం గురించి ఆలోచించడానికి మలిక్ కవితలు ఎంతగానో ఉపయోగపడతాయి.

"అశ్లీల సాహిత్యం" అనే కవితలో
"ఇంటిలోని పూలవనమయి
వెల్లివిరిసే వసంత రుతువును
వీధిలోన గోరికట్టి వెల్లవేశావా"

ఈ కవిత సమాజం తీరుతెన్నులను ప్రశ్నించే కవిత. ఇందులో ప్రజాప్రయోజనమూ ఉంది. సంస్కరణా ఉంది. కవిత్వ సౌందర్యమూ ఉంది. క్లుప్తంగా చెప్పాలంటే ఇది జీవితం. మనిషి జీవితానికి అర్థాన్నిచ్చే వాక్యాలివి. రూపకాలను అద్భుతంగా వాడిన తీరు వహ్వా అనిపిస్తుంది.

ఇక్బాల్ కవిత సారే జహాఁ సే అచ్ఛాను తెలుగులో అనువదించినా, తనకు సుదీర్ఘకాల అనుబంధం ఉన్న జమాఅతె ఇస్లామీ హింద్ గురించి రాసినా తనదైన ప్రత్యేక గొంతును విన్పించారు.

తేటగజల్ పేరుతో రాసిన కవితలు ప్రత్యేకంగా ప్రస్తావించదగినవి.

గుండె పేర్చిన నిప్పుకుండ

ఎండగానె మండవలెనా

కంటి నుండి ఎగిసిపారే

నీటిపుట్టకు ఆరవలెనా

గుండె ఒక నిప్పుకుండను పేర్చుతున్నట్లు ఊహించడం, కన్నీటిని నీటిపుట్టగా ఊహించడం అసాధారణమైన ఊహలు. ఒక గజల్ రాయడానికి కావలసింది అసాధారణమైన ఊహ, అద్భుతమైన చమత్కారం, అందమైన అభివ్యక్తి. ఇవి తేటగజల్ రచనల్లో పుష్కలంగా కనిపిస్తాయి.

మలిక్ గారి కవితల్లో మనకు తీవ్రమైన స్వరం వినిపించదు. మేధస్సును తొలిచే ప్రశ్నలు కనిపిస్తాయి. మనోభావాలను సునామీలా ముంచెత్తే భావావేశాలుంటాయి. కవిత్వం గురించి జావేద్ అఖ్తర్ మాట్లాడుతూ ఒకసారి ఏమన్నాడంటే... Thought, Felt అనే రెండు పదాల కలయిక అన్నాడు. మనోమస్తిష్కాలను రెండింటిని ప్రభావితం చేసేది కవిత్వం. కేవలం మానసిక భావోద్వేగాన్ని కలిగించడంతో పాటు మేధో అలజడిని రేపడం మల్లిక్ గారి కవిత్వం ప్రత్యేకత.

''సిగ్గేది''పేరుతో రాసిన కవితలోని ఈ పంక్తులతో మలిక్ గారి కవిత్వమేమిటో ఇంకా చక్కగా అర్థం చేసుకోవచ్చు.

''వళ్ళంతా చీమలే

ఒక్కటీ కుట్టినట్లు లేదు''

ఈ వాక్యాల్లో చీమలు కుట్టలేదని చెప్పలేదు. కుట్టినట్లు లేదంటున్నారు. అంటే చీమలు కుడుతున్నాయి. కాని కుట్టినబాధ కాని నొప్పి కాని తెలియడం లేదు. నొప్పి తెలియకపోవడం అనేది మత్తులో ఉన్నప్పుడే జరుగుతుంది. అదెలాంటి మత్తు? ఈ ఆలోచనలే మలిక్ కవిత్వం పాఠకునిలో కలిగేలా చేస్తుంది.

ఈ కవిత్వ సంపుటిలో ఇలాంటి ఎన్నో అద్భుతమైన కవితలున్నాయి. తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ప్రచురిస్తున్న ఈ కవిత్వ సంపుటి త్వరలో రానుంది. పేజీలు : 325

## సిగ్గేది?

నిజం-
దూరాలు చేరువయ్యాయి
కాలాలు కుంచించుకుపొయ్యాయి
చరిత్ర కూలిపోయింది
లిబర్టీ బొమ్మ గట్టిగా
కళ్ళు మూసుకుని
గగనానికెగిసిపోయింది
మొహెంజోదారో వళ్ళు జలదరించి
మరోసారి నేలలో కూరుకుపోయింది
..........................
..........................
నిజం నేస్తం-
సూరత్‌లో స్త్రీత్వం
స్థాణువయి మిగిలింది
నగరమంతా నడివీధిలో
నగ్నమయి పరుగుతీసింది
బొంబాయిని
బజారులు నెత్తురు పులిమాయి
అగ్నిజ్వాలలు మింగాయి
పట్టపగలే బూడిద చేశాయి
నయీ దిల్లీ నివ్వెరపోలేదు
అమ్నెస్టీ అడగరాలేదు
వళ్ళంతా చీమలే-
ఒక్కటీ కుట్టినట్టు లేదు
కాని నేస్తం-
నజరుల్ ఇస్లాం గడ్డన
బ్రహ్మపుత్ర ఒడ్డున
రవీంద్రుని పొరుగున
వంగ దేశపు ఆడబిడ్డ
తనవారి తైతక్కలకు
'లజ్జ'తో ముడుచుకు పోయింది
మతి చెడి మాయమయి పోయింది

# ఆదోనిలో ఖిద్మత్ బ్రాంచ్ ప్రారంభం

- ఎమ్మిగనూరు చాందన్న







**వడ్డీ** ఇస్లాంలో నిషిద్ధం. ఒకే దేవుడిని, మరణాంతర జీవితాన్ని స్వర్గ నరకాలను విశ్వసించినట్లే.. ఈ వడ్డీ కూడా నిషేధం, అధర్మమని విశ్వాసి భావిస్తాడు. దానికి ప్రత్యామ్నాయం చూపడమే విశ్వాసి ధ్యేయం. ఒక వ్యక్తి రాంగ్ రూట్లో వెళ్తుంటే, అతడిని చూసి నువ్వు వెళ్ళేది రాంగ్ రూటు అని చెప్పడమే కాకుండా అతడికి కరెక్ట్ రూట్ ఏదో చెప్పడం, చూపడం కూడా మన బాధ్యత అని జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ రఫీక్ అన్నారు. ఆదోనిలో ఖిద్మత్ బ్రాంచ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ మాటలు చెప్పారు. వైసిపి యువ నేత మనోజ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఖిద్మత్ సొసైటీ ఆదోని బ్రాంచ్ ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు డాక్టర్ మధుసూదన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జమాఅతె ఇస్లామీ హింద్ అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ నేడు ప్రారంభిస్తున్న ఖిద్మత్ బ్రాంచ్ ఆంధ్ర రాష్ట్రంలో పదవ బ్రాంచ్ అని చెప్పారు. వడ్డీ నిషిద్ధం అని చెప్పినంత మాత్రాన సరిపోదు ప్రత్యామ్నాయం చూపవలసి ఉంటుంది. వడ్డీ నుంచి విముక్తి కలిగించే లక్ష్యంతో ఏర్పడిందే ఖిద్మత్ అన్నారు. ఈ ఖిద్మత్ ఏర్పాటు ముస్లిం ధార్మిక విశ్వాసానికి అనుగుణంగా జరిగిందని, ఒక నిజమైన విశ్వాసి తాను బ్రతుకుతూ ఇతరులకు కూడా చేయూతను అందిస్తాడని చెప్పారు. ఈ ఖిద్మత్ బ్రాంచ్ సౌత్ ఇండియాలోనే 42వ బ్రాంచ్ . ఇప్పటివరకు 2000 కోట్ల ట్రాన్సాక్షన్స్, 82వేల మంది సభ్యులతో రూ.900 కోట్ల వడ్డీ రహిత రుణాలను ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. 96.5% రికవరీ కూడా ఉందన్నారు. బాధ్యతా భావాన్ని పెంచడం, విలువలు, ప్రమాణాలకు కట్టుబడడం ప్రధానంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

ఈ కార్యక్రమాల వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని చెప్పారు. కేవలము దైవప్రసన్నత, పరలోక సాఫల్యం మాత్రమే దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలియజేశారు. ఎలాంటి పేరు ప్రఖ్యాతులు ఆశించి ఈ పని చేయడం లేదని వివరించారు. ఖిద్మత్‌లో ఖాతాదారులు ఉండరు, వాటాదారులు, భాగస్వాములు ఉంటారని వివరించారు. ఇందులో ప్రతి సభ్యుడికి 300 రూపాయల వాటా ఉంటుంది. సభ్యులకు రుణాలను ఇచ్చే ఖచ్చితమైన ప్రక్రియ ఉంది. సభ్యుల వ్యవహారశైలి, వారి అవసరాలు అన్నీ గమనించి రుణాలు ఇవ్వడం జరుగుతుంది. ఒకవేళ ఖిద్మత్ మెంబరు వ్యసన పరుడు, ఎలాంటి బాధ్యత లేని వాడు, భార్యా పిల్లల్ని హింసిస్తూ... పట్టించుకోని వాడు అయితే అతడికి లోన్ ఇవ్వడం జరగదు.

### ఖిద్మత్‌లో పేద ప్రజలు, చిన్నచిన్న వ్యాపారస్తులు,

తోపుడుబండ్ల వ్యాపారులు, రోడ్డు పక్కన ఫుట్పాత్ వ్యాపారాలు చేసుకునేవారి కోసం, చిన్న చిన్న కార్ఖానాలు నడుపు కునే వారి కోసం మాత్రమే ఖిద్మత్ రుణాలు అందిస్తుంది. ఈ సొసైటీ

కేవలం పేదల కొరకు, పేదల చేత, పేద ప్రజల ద్వారా నడపబడే సొసైటీ. ఇక్కడ పేదవాళ్లే పెట్టుబడిదారులు పేదవాళ్లే భాగస్వాములు.

## ఖిద్మత్ సొసైటీ స్థాపనకు ఇస్లామీయ బోధనలే ప్రేరణ

ఇస్లాం ఒక పూర్తి జీవన వ్యవస్థ. ఇస్లాం మనిషిని వ్యక్తిగతంగాను సామాజికంగాను సంస్కరిస్తుంది. వడ్డీ, వ్యభిచారం సర్వసాధారణ మైన సమాజంపై దేవుని ఆగ్రహం, శిక్ష విరుచుకు పడతాయి. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలన్నీ కేవలం వడ్డీ పైనే ఆధారపడి నడుస్తున్నాయి. వడ్డీ లేకుండా కిద్మత్ సొసైటీ నడుస్తుందంటే చాలామందికి ఆశ్చర్యం కలుగుతుంది.


గుంటూరులో 2005లో మొట్టమొదటి బ్రాంచ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రోజు ఆ బ్రాంచి 500 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. గుంటూరు బ్రాంచ్‌లో 3500 మెంబర్స్ ఉన్నారు. అందులో రమారమి 30శాతం మంది క్రైస్తవ, హైందవ సోదరులు ఉన్నారు. ఆడవాళ్లు ఉన్నారు. ఈ విధంగా ఈ సొసైటీ సమస్త మానవుల సేవ కోసం పనిచేస్తున్నది.

ఇటీవల సీఎం జగన్మోహన్ రెడ్డి గారితో వడ్డీ లేని వ్యవస్థ గురించి మాట్లాడితే, ఆయన దీని గురించి చర్చిద్దాం మాట్లాడు దాం అని చెప్పారు. అంటే మన నాయకులలో కూడా ఆలోచన పెరుగుతున్నది. మార్పు కూడా వస్తున్నది. వడ్డీ లేని వ్యవస్థ గురించి మన నాయకులు కూడా ఆలోచిస్తున్నారు. ఒకవేళ వడ్డీ వ్యవస్థతో ఆర్థిక లావాదేవీలు నడుస్తూ ఉంటే.... కోటీశ్వరుడు కోటీశ్వరుడుగానే ఉండిపోతాడు. పేదవాడు పేదవాడిగానే మిగిలి పోతాడు. ఉదాహరణకు మన దేశంలో ప్రపంచంలోనే అత్యధిక ధనవంతులు దాదాపు పదిమంది ఉన్నారు. ముంబైలో ప్రపంచం లోనే అత్యధిక పెద్ద మురికివాడ కూడా ఒకటి ఉంది. అదే ఆసియాలోనే అత్యంత పేదలు నివసించే మురికి వాడగా ప్రసిద్ధి పొందింది. అంటే అత్యంత ధనికులు ఉన్న పేద దేశంగా మనము ఎందుకున్నామంటే... ఈ వడ్డీ కారణంగానే జరుగుతుంది.

కనుక ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని రిపేర్ చేసే పనులు జరగాలి. ప్రాక్టికల్‌గా ప్రత్యామ్నాయం చూపించాలి. ఉదాహరణకు మద్యం లేకుండా ప్రభుత్వం నడవదు. మద్యం సేవించి బండి నడపరాదు. కానీ మద్యం అమ్ముతూ ప్రభుత్వం నడపవచ్చు. ఇదొక విచిత్రమైన పరిస్థితి. ఇది విమర్శించడం కోసం కాదు. మరి ఏం చేయాలి? దీనికి విరుగుడు ఏమి లేదా? తప్పకుండా విరుగుడు ఉంది..

మద్యం లేకుండా ప్రభుత్వాన్ని సక్సెస్‌ఫుల్‌గా ఎలా నడపాలి? అనే విషయంపై మన యువత రీసెర్చ్ చేయాలి. దీనిపై ఫైనాన్షియల్ థింకర్స్, ఎకనామిస్ట్‌లు, మేధావి వర్గాలు మీద పరిశోధించి పనిచేసి ఆల్టర్నేటివ్ చూపించాలి. అలాగే వడ్డీ తినడం నిషేధం అని కేవలం చెబితే సరిపోదు దానికి ఆల్టర్నేటివ్ ఏదో చూపించాలి. అలాంటి ప్రయత్నమే ఈ ఖిద్మత్ సొసైటీ. ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వడ్డీ గురించి ఏమన్నారంటే, వడ్డీ పాపాన్ని 70 భాగాలుగా విభజిస్తే అందులో అత్యంత చిన్న భాగం తన తల్లితో వ్యభిచారం చేయడంతో సమానమని చెప్పారు. అలాంటి అత్యంత హేయమైన నీచమైనది వడ్డీ. అలాగే మానవులందరికీ దేవుడు పంపిన ఖురాను గ్రంథములో వడ్డీ లావాదేవీలు మానుకోండి. ఒకవేళ మీరు వడ్డీ లావాదేవీలు వదులుకోకపోతే... దేవుడితో ఆయన ప్రవక్తతో యుద్ధానికి సిద్ధం కండి అని కఠినమైన హెచ్చరిక ఉంది. అందువల్లనే ముస్లిములు వడ్డీ విషయమై చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారని ఆయన వివరించారు.

అలాగే వైసిపి యువ నేత మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వడ్డీ లేని లావాదేవీలు నిర్వహిస్తూ విలువలతో కూడిన ఆర్థిక వ్యవహారాలు నడపటం నేటి రోజుల్లో చాలా గొప్ప విషయమ న్నారు. రఫీక్ గారి మాటలతో తాను చాలా ఇంప్రెస్ అయ్యానని చెప్పారు. సీఎం జగన్‌తో కూడా కలిసి ఈ ఖిద్మత్ బ్యాంక్‌ను వివరించి ఇస్లామిక్ బ్యాంకింగ్ గురించి చర్చించడం చాలా మంచి విషయమన్నారు. ఈ రోజు ఈ మీటింగ్‌లో హాజరు కావడం తన అదృష్టంగా పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి హాజరు కాకపోయి ఉంటే చాలా విషయాలు కోల్పోయేవాడిని అని అన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఉన్నత స్థాయికి ఆదోని బ్రాంచ్ ఖిద్మత్ చేరుకునేలా మేమందరం కూడా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కుల, మతాలకు అతీతంగా పని చేస్తున్నటువంటి జమాఅతె ఇస్లామి హింద్‌ను ఆయన అభినందించారు. ఖిద్మత్ రీజనల్ డైరెక్టర్ ఇక్బాల్ హుస్సేన్, ఏపీ జిఎస్ కరీముద్దీన్, స్థానిక బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, బిఎంసి ప్రెసిడెంట్ కలీం సిద్దీకి, ఆదోని బ్రాంచ్ ఫౌండర్ అయినటువంటి ఇసాక్ సాబ్, ఖాజీ అల్తాఫ్ హుస్సేన్, టిపిఎస్ చాంద్ బాషా ఇలియాస్, జాకీర్ భాయ్‌లతోపాటు పట్టణ ప్రముఖులు మైనారిటీ నాయకులు హిందూ ముస్లిం క్రైస్తవ సోదరులు దాదాపు 100 మందికిపైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మట్టి రేణువులే అక్షరాలైతే...

- రూహీ

**థకన్ కో వోఢ్ కే బిస్తర్ మే జాకె లేట్ గయే**

**హమ్ అప్నీ ఖబ్రె ముకర్రర్ మె జాకే లేట్ గయే**

**తమామ్ ఉమ్ర్ హమ్ ఏక్ దూసరేసే లడ్ తే రహే**

**మగర్ మరే తో బరాబర్ మే జాకే లేట్ గయే**

ప్రముఖ ఉర్దూ కవి మునవ్వర్ రాణా రాసిన పంక్తులివి. ఈ పంక్తులకు భావం:

అలసటను కప్పుకుని పడకపై పడుకున్నాను

నిర్ణీత సమాధిలోకి వెళ్ళి పడుకున్నాను.

జీవితాంతం ఒకరితో ఒకరు పోట్లాడుతూనే ఉన్నాం

చివరకు చనిపోతే సమానులమై సమాధిలో పడుకున్నాం

1952 నవంబరు 26న జన్మించిన మునవ్వర్ రాణా సమాధి గురించి ఇలాంటి ఎన్నో కవితలు రాసిన ఆయన చివరకు 2024 జనవరి 14న అదే సమాధికి చేరుకున్నారు. మట్టి గురించి, అమ్మ గురించి మునవ్వర్ రాణా రాసిన కవితలు ప్రజల నాలుకలకు అతుక్కుపోయాయి. ఇక్కడి మట్టి గురించి ఆయన రాసిన కవితలు మునవ్వర్ రాణా ఏ మతానికి చెందిన వారో ఆ మతస్తులపై విద్వేషాన్ని ప్రచారం చేసే మతతత్వ శక్తులకు జవాబులాంటి కవితలు. 2014 తర్వాతి భారతదేశం, ఎంతో మారిపోయిన ప్రస్తుత కాలానికి చాలా ముందు మునవ్వర్ రాణా తన కవితల్లో రాసిన వాక్యాల్లోని దేశప్రేమ, మట్టి ప్రేమకు సరితూగే వాక్యాలు చాలా తక్కువగా దొరుకుతాయి.

తలబిరుసు జనం మమ్మల్ని ప్రాణశత్రువులంటున్నారు

కాని మేం ఇక్కడి మట్టిని మా అమ్మ అంటున్నాం ... అని రాశాడాయన.

ఈ కవిత చాలా చిన్నది కాని మూకలుగా దాడులు చేస్తూ, చుట్టుముట్టి కొట్టి చంపేసే మూక హంతకులకు చెంపపెట్టు లాంటి కవితలివి. ఇక్కడి వాళ్ళెవరు? అక్కడి వాళ్ళెవరు? అంటూ, పరాయీకరణలు చేస్తూ, ఫర్మానాలు జారీచేసి విద్వేషాన్ని రెచ్చగొట్టే శక్తులకు జవాబుగా ఆయన రాసిన వాక్యాలు:

**మీరు మమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించలేదు**

**మీరు భాయి అనడం లేదు మియా అంటున్నారు**

అని సూటిగా మతతత్వశక్తుల వైఖరిని ఎండగట్టారు. ఈ బాధ కేవలం మునవ్వర్ రాణా ఒక్కరి బాధ కాదు. ఒక సముదాయం అనుభవిస్తున్న బాధ. ఇప్పుడు, ఈ కాలంలో నడుస్తున్న చరిత్ర ఇది.

**మట్టిలో కలిసినా వేరుపడలేను**

**ఇంతకన్నా ఎక్కువగా నీవాడిని కాలేను**

ఇలాంటి అనేక కవితలు సగటు ముస్లిం అనుభవిస్తున్న బాధను ప్రతిబింబిస్తున్నాయి. కాని అందరికి గొంతు విప్పి తమ బాధను ప్రకటించే సామర్థ్యం ఉండకపోవచ్చు. మునవ్వర్ రాణా వంటి కవులు అందరి తరపున జవాబిచ్చి ఈ లోకం వదిలి వెళ్ళిపోతారు.

మునవ్వర్ కవితల్లో ఇక్కడి మట్టి అనేక రూపాల్లో, అనేక హంగులతో కనిపిస్తుంది. మునవ్వర్ ఇక్కడి మట్టిని ఒక జవాబుగా తన కవితల్లో ప్రయోగించారు. శాశ్వతంగా ఇక్కడి మట్టిలోనే నిద్రించే ఆకాంక్షను ప్రకటించారు. సగటు ముస్లిములందరి మనోస్థితి ఇదే. చనిపోయిన తర్వాత కూడా ఇక్కడే ఉంటాం... ఇక్కడివాళ్ళుగానే ఉంటాం.. అనేదే ఆ మానసిక స్థితి. ఎ.పి.జె అబ్దుల్ కలామ్ చనిపోయినప్పుడు మునవ్వర్ రాణా రాసిన పంక్తులు

**మరోసారి నన్ను మట్టికి అభిముఖం చేయండి**

**గౌరవంగా లోకం నుంచి నిష్క్రమించేలా చేయండి**

ఈ మట్టిని ప్రేమించే మునవ్వర్ రాణా కవితలు సగటు ముస్లిం మనోభావాలకు నిదర్శనాలు. కాని వారిపై ప్రశ్నల దాడులకు దిగే మతతత్వ శక్తులకు ఇవన్నీ పట్టవు. మునవ్వర్ రాణా కవితల్లో ఈ మట్టి నుంచి పుట్టి, ఈ మట్టిలో కలిసే వరకు ఒక పూర్తి జీవితదృశ్యం కవితావాక్యం.

నమాజుకు ముందు వుజూ చేసుకుంటారు. వుజూకు నీళ్ళు దొరకక పోతే తయమ్ముమ్ చేసుకుంటారు. తయమ్ముమ్ అంటే మట్టితో శుభ్రపరచుకోవడం.

మునవ్వర్ రాణా ఈ పదాన్ని ఉపయోగిస్తూ ..

**మాతృదేశ మట్టిని అడుగుతున్నాను**

**నా తయమ్ముమ్ పై ఒట్టేసి చెప్పు**

**నా నుదుటిపై సజ్దాల గుర్తులు ఏం చెబుతున్నాయో వివరించు**

అని రాసుకున్నారు.

ఇప్పుడు మాతృదేశంలో ఆ మునవ్వర్ లేడు. ఈ దేశపు మట్టి గురించి ఆయన ఎన్ని కవితలు రాశాడో... మునవ్వర్ రాణా కవిసమ్మేళనాల్లో సూపర్ స్టార్‌గా వెలిగిన కవి. ఒకప్పుడు మీడియాలో కూడా ఆయన సూపర్ స్టార్.

**హర్ ఏక్ ఆవాజ్ అబ్ ఉర్దూ కో ఫరియాదీ బతాతీ హై**

**యే పగలీ అబ్ తక్ ఖుద్ కో షహజాదీ బతాతీ హై**

**కయీ బాతే ముహబ్బత్ సబ్ కో బునియాదీ బతాతీ హై**

**జో పడ్ దాదీ బతాతీథీ వహీ దాదీ బతాతీ హై**

**జహాఁ పిఛలే కయీ బర్సోఁసే కాలే నాగ్ బైఠేఁ హైం**

**వహాఁ ఏక్ ఘూంసలా చుడియోఁకా థా దాదీ బతాతీ హై**

అంటూ ఆయన కవిత్వం వినిపిస్తున్నప్పుడు వందలాది, వేలాది మంది శ్రోతలు వహ్వా అంటూ కొట్టే చప్పట్ల చప్పుడుతో పరిసరాలు దద్దరిల్లేవి.

"మట్టి లోతుల్లో నేను దిగిపోవాలి.

జీవితమా, ప్రయాణ సామగ్రి మూటగట్టుకో, ఇక వెళ్ళాలి"

అని రాసిన మునవ్వర్ రాణా వెళ్ళిపోయారు. కవుల తుది ప్రయాణం కూడా భలే విచిత్రమైంది. మౌనంగా కవి పరలోకానికి వెళ్ళిపోతాడు కాని అతని కవితలు గొంతెత్తి పలుకుతూ ఉంటాయి. ఏదైనా కవిత ఆయనకు తట్టినప్పుడు ఆయన కళ్ళు మిలమిల మెరిసేవి. ఆయన కవిత్వం చదివే పద్ధతి నాటకీయంగా శ్రోతలను ఉర్రూతలూగించేది. రాయబరేలీకి చెందిన మునవ్వర్ రాణా లక్నో, కలకత్తాలతో సన్నిహిత సంబంధం కలిగిన కవి. కలకత్తాలో ఆయన ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ చేశారు. మునవ్వర్ రాణా గురువు వాలి ఆసి రాసిన ఒక కవితను మునవ్వర్ రాణా ఒకసారి ప్రస్తావించారు. ఆ కవిత:

**"నీ కోసం దువా చేస్తూ ఈ లోకం నుంచి నిష్క్రమిస్తాం**

**స్వభావంలో ఫకీర్లం మేం మాకు లోకంతో ఏం పని"**

2014లో ఆయనకు సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఆ తర్వాత నిరసన తెలిపే పరిస్థితి వచ్చినప్పుడు తన అవార్డును వాపసు కూడా ఇచ్చేశారు. అవార్డు వాపసీ చేసిన వారిలో మునవ్వర్ కూడా ఉన్నారు. ప్రధాని మోదీ మునవ్వర్ రాణా మరణవార్త తర్వాత సంతాపం ప్రకటించారు. డెబ్బయి ఒక్క సంవత్సరాల మునవ్వర్ రాణా రాసిన కవితల్లో ముస్లిములను పాకిస్తానీలు వగైరా పేర్లతో పిలిచే ప్రతి ఒక్కరికి జవాబులున్నాయి. ఈ విద్వేష వాతావరణం పట్ల ఆయనలో చాలా బాధ కూడా ఉండేది. భారతదేశ విభజన తర్వాత ఇక్కడి నుంచి పాకిస్తాన్ వలసపోయిన కొందరు ముస్లిముల వ్యథలను ఆయన తన కవితల్లో అభివ్యక్తం చేశారు.

**ముహాజిర్లం, మేం ఒక ప్రపంచాన్ని వదిలి వచ్చాం**
**మీ దగ్గర ఎంత ఉందో అంత మేం వదిలేసి వచ్చాం**
**మేం మట్టి కోసం బంగారాన్ని వదిలేసి వచ్చాం**
**కథలోని ఈ భాగాన్ని ఇప్పటి వరకు దాచి పెట్టారు**
**ఆలింగనం చేసుకునే నదులు**
**కౌగిలించుకునే మతాలు**
**అలహాబాద్‌లో ఎలాంటి దృశ్యాలు వదిలేసి వచ్చాం...** అని రాశారు.

ఆయన ఆరోగ్యంగా ఉన్నంత కాలం కవిసమ్మేళనాల్లో ఒక హీరోగా ఉన్నారు. అనారోగ్యం పాలయి ఆసుపత్రికి వెళ్ళి వచ్చిన తర్వాత కూడా ఆయన కవి సమ్మేళనాలు వదల్లేదు.

**వర్షం ఎక్కువగా కురిస్తే నేల కుంగిపోతుంది**
**ఎక్కువగా రోదించకు రోదిస్తే గుండె కుంగిపోతుంది**

మునవ్వర్ రాణా కవితల్లో సగటు మనిషి సుఖదుఃఖాలున్నాయి. చాలా సరళమైన భాషలో రాశారు

**ఒక్క కన్నీటి చుక్క కూడా ప్రభుత్వానికి ప్రమాదమా**
**కళ్ళు సముద్రాలవ్వడం నువ్వు చూడలేదా?**
**ఫుట్ పాతుపై దినపత్రిక పరచుకుని నిద్రపోతారు**
**శ్రామికులు నిద్రమాత్రలు ఎప్పుడూ వేసుకోరు**

ఇలాంటి అనేక కవితలు:

గమ్యం దగ్గరకొచ్చినప్పుడు ఒక కాలు తెగిపోయింది.
రోడ్డు విశాలమైతే నా వూరు తెగిపోయింది.

ఈ కవితలన్నీ పేదల జీవితాలే. ప్రతి రోజు నగరాల్లో మురికివాడల్లో పేదల ఇళ్ళు కూల్చివేతలకు గురవుతుంటాయి. బుల్‌డోజర్లతో ఇళ్ళు కూల్చేయడం జరుగుతుంటుంది. మునవ్వర్ కవితలు చదివితే ఇలాంటి వార్తలే దినపత్రికల్లో చదివాం కదా అనిపిస్తుంది. నగరంలో పరిస్థితులను ఆయన ఎంతో చక్కగా తన కవిత్వంలో రాశారు.

**"ఇళ్ళు కూలిపోయిన వాళ్ళు ఎక్కడికి వెళతారో మనకు తెలియదు**
**ఆలోచించాలి, మీరు, అందరూ కలిసి ఆలోచించాలి**
**బూడిదగా మారినప్పుడు నిప్పులు ఎక్కడికి పోతాయో ఆలోచించాలి"** అని రాశారు.

మునవ్వర్ అమ్మపై రాసిన కవితల కోసం శ్రోతలు ఎదురు చూసేవారు. ఆయన అమ్మ గురించి అనేక కవితలు రాశారు. ఆయన రాసిన కవితల్లోని అమ్మ అందరికి తమ అమ్మలా కనిపించేది.

**"నేను మరోసారి దైవదూతగా మారిపోవాలనుకుంటున్నాను**
**పిల్లాడిలా అమ్మను చుట్టేయాలనుకుంటున్నాను"**

అని రాసుకున్నారు.

మునవ్వర్ రాణా కవిసమ్మేళనానికి వస్తున్నారంటే వేలాది మంది వినడానికి వచ్చేవారు. అద్భుతమైన కవిత్వం రాసిన మునవ్వర్ ఈ లోకం నుంచి నిశ్శబ్దంగా నిష్క్రమించారు.


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

## కరీముల్లా కవిత్వం

# కత్తిమొన

ఒక్కోసారి
ఉసురు తీసేది
ఉరికొయ్యే కానక్కర్లేదు.
ఉడికించే మాట చాలు
సంగమించే నదీ ప్రవాహాల్ని
పాయలుగా చీల్చేందుకు
ఇటుకల్నే మోయనక్కర్లేదు.
సరిహద్దులు గీసే భాష్యం చాలు
కమ్మని గేయాల్లో విషం వొంపి
నాగుల్ని నర్తింపజేసే చోట
గీతాలు సైతం గునపాలై
గుండెల్ని గురిచూసి తాకగలవు .
సుగంధం చేసి నలుదిక్కులా
వెదజల్లాల్సిన పాటను
కత్తిమొనను చేసి
నా కంఠనాళంపై పెడ్తావా?
వటవృక్షం వంటి విశ్వాసాన్ని
పూమొగ్గలా తుంచాలని చూస్తావా?
వందేమాతరం పాడనోళ్ళంతా
దేశద్రోహులైతే!
నెహ్రూ, నేతాజీలెవరు?
అపనమ్మకాల కలుగులో దూరి
అంతరాల పద్మవ్యూహాన్ని పన్నిన
నీ ముందు అభద్రతల అభాగ్యుడ్నయి
నేనెన్నిసార్లు చావను?

ఈ నేలను తల్లిలా ప్రేమించిన వాడ్ని
తల్లిపాదాల క్రింద స్వర్గముందన్న
ప్రవక్త మాటను నమ్మినవాడ్ని
నా దేశభక్తినే శంకిస్తావా?
రేయ్ బడాచోర్!
సవాలక్ష రంగులు మార్చే
ఉన్మాదాల ఊసరవెల్లివి నువ్వు
ఒకే దైవాన్ని, ఒకే విశ్వాసాన్ని
ఒకే మట్టిని కలగనేటోడ్ని నేను
బందీగా మారిన మాతరం
బందేమాతరం అంటూ విలపిస్తుంటే
బాంఛన్ నీ కాల్మొక్తా అంటాననుకోకు
నేనెలా శ్వాసించాలో
నాకెవరూ నేర్పనక్కర్లేదు
నేనే పాటై పోటెత్తాలో
నాకెవరూ చెప్పనక్కర్లేదు
నేను భారతీయుడ్ని
ఈ దేశ మూలవాసిని
నువ్వు వందేమాతరమై వస్తే
నే జనగణమన గీతమై జ్వలిస్తా
నీ పల్లవిని నే గౌరవిస్తా
నా శ్రుతిని నువ్వు ఆస్వాదించు
అప్పుడే మనం ఒక పాటగా,
ఒక దేశంగా మనగలం.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




"నేను చాలా సంవత్సరాలుగా ఇస్లాం మత ధర్మాన్ని నిశితంగా అధ్యయనం చేశాను. ఇస్లాం ఓ మతం మాత్రమే కాదు, ఓ మహత్తరమైన విప్లవోద్యమం. ప్రజల మేథా హృదయాలను పరివర్తింపచేసిన మహా శక్తివంతమైన సంస్కరణోద్యమమది. అది కూడా ఏ కాలంలో జరిగింది? స్వేచ్ఛగా అభిప్రాయాన్ని వెల్లడించే వాక్ స్వాతంత్ర్య హక్కులు లేని కాలంలో అంతటి అనితర సాధ్యమైన అమూల్య వరాన్ని మానవ జాతికి పరిచయం చేసి వాక్ స్వాతంత్ర్య బీజం నాటిన కారణంగా అందులోంచి ప్రజా స్వామ్యం అనే మహా వృక్షం ఆవిర్భవించి ప్రపంచం ముందు నిలిచింది. అట్టడుగు అణగారిపోయిన పీడిత మానవులు జీవం పోసుకుని లేచి నిలబడ్డానికి అమితంగా సహకరించిన మొట్ట మొదటి మత ధర్మం ఇస్లాం."

ఇది ఎవరో వెలిబుచ్చిన అభిప్రాయం కాదు. విశ్వవిఖ్యాత ఐరోపా మేధావి "కార్లాయల్" ఇస్లాం గురించి తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ వ్రాసిన పదాలివి.

వాస్తవానికి ఇస్లాం మతంకంటే కూడా ఓ విప్లవాత్మకమైన సంస్కర ణోద్యమం. అది అవతరించిన వెంటనే మిత్రులు, శత్రువులు అందర్నీ ఆకట్టుకుని కట్టిపడేసింది.

మనం ప్రజాస్వామ్య యుగంలో పయనిస్తున్నాం. ప్రజాస్వామ్యం అంటే చిన్న, పెద్ద, సంపన్నుడు, నిరుపేద అన్న విభేదాల్ని, అంతరాల్ని రూపుమాపి అందరికి సమాన హక్కుల్ని కట్టబెట్టడం, ప్రతీ మానవుణ్ని మానవునిగా భావించి గౌరవించడం, ఇస్లాం ఆదేశించిన సామూహిక నమాజ్, జుమ్మా, పండుగల నమాజుల్లో, దైవగృహ సందర్శన (హజ్ యాత్ర) సమావేశాల్లో ఆ ప్రజాస్వామ్య దృక్పథం తొణికిసలాడుతుంది. ఆ సమయాల్లో సంపన్నులు, నిరుపేదలు, చిన్నాపెద్దా ముస్లింలందరూ భుజం భుజం కలిపి ప్రక్క ప్రక్కగా నిల్చుని ఉంటారు. అంతేకాదు, ఈ ప్రజాస్వామ్య దృక్పథం ముస్లింల ఆరాధనల్లో కూడా సమ్మిళితమై పోయిన కారణంగా వారి జీవిత రంగాలన్నింటిలోనూ ప్రజాస్వామ్య భావన కనబడుతుంది.

న్యాయబద్ధమైన వనరుల విభజన ప్రజాస్వామ్యంలోని ప్రధానాంశం. కాగా, ప్రస్తుత పెట్టుబడిదారి విధానం, నిజమైన, ప్రజాస్వామ్యానికి వినాశనకారియని అనేకమంది అంగీకరించారు. ఈ లోపభూయిష్టమైన విధానం ఫలితంగా వ్రేళ్ళ మీద లెక్కపెట్టగల కొందరు వ్యక్తులు, ఇతరుల శ్రమ, అర్హతలు ప్రతిభలతో ప్రయోజనం పొంది భోగాలు అనుభవిస్తూ సుఖ జీవనం గడుపుతుంటారు. సామాన్య ప్రజలు ఎంత కష్టపడినా, ఎంతగా శ్రమించినా కూడా తృప్తి, ప్రశాంత జీవితం గడపడం దుర్లభం. ఇంకా వారిలో చాలామందికి రెండు పూటలు కడుపు నిండా తిండి కూడా లభించదు. అది మన కళ్ళకు కానవస్తున్న వాస్తవం.

నేటికి 15 వందల సంవత్సరాలకు పూర్వం ఇస్లాం ఈ పెట్టుబడి దారి వాదం వల్ల సంభవించే వినాశనాన్ని పసికట్టేసింది. అందువల్ల అది మానవ నైజానికి అనుగుణంగా మౌలిక సూత్రాల్ని ప్రతి పాదించింది. వానిని క్రియాత్మకంగా ఆచరించడం వల్ల పెట్టుబడి దారి వాదం, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానం ఛిన్నాభిన్నమయి పోతుంది. ఇస్లాం శిక్షణల్ని పరిశీలిస్తే ఆ వాస్తవం తేటతెల్లమవు తుంది. వారసత్వ హక్కుల విభజన, ప్రజా ధనాగారాన్ని ఏర్పరచడం జకాత్, ఉషర్ చెల్లించడం, వడ్డీ నిషేధించడం వంటి ఆజ్ఞలు పెట్టుబడిదారి విధానానికి వజ్రఘాతాల్లాంటివి. ఈ ఆజ్ఞల వల్ల పెట్టుబడిదారుల దోపిడి సాగదు. అంతేకాక, మానవ ప్రవృత్తి, బలహీనతలను అనుగుణంగా ఉన్న ఈ ఆజ్ఞల వల్ల సమాజంలో సమతూకం ఛిన్నాభిన్నమయ్యే ప్రమాదం సంభవించదు.

బహిరంగంగా కానవస్తున్న ప్రస్తుత కాలపు ప్రత్యేక లక్షణం

ఏమంటే శ్రామిక వర్గానికి, పెట్టుబడిదారి వర్గానికి మధ్య సంఘర్షణ సాగుతూ వస్తూనే ఉంది. ఈ సంఘర్షణ కారణంగా ప్రతీ దేశంలోని ప్రజలు పెట్టుబడిదారి వర్గం, కార్మిక వర్గంగా రెండుగా చీలిపోయారు. కార్మికుల కష్టాలు ఆసాములకు పట్టవు. ఆసాముల ఇబ్బందులు కార్మికులకు పట్టవు.

సంపన్న వర్గాల వారు, కార్మికుల శ్రామికుల కష్ట బాధల్ని గ్రహించి తీరాలని ఇస్లాం వాంఛిస్తుంది. అందువల్లే ఆ ఆశయ సాధన కోసం ఒక మాసం ఉపవాస దీక్ష వహించాలని ఇస్లాం ఆజ్ఞాపించింది. దానివల్ల సంపన్నులకు కూడా ఆకలి, నిరుపేదల కష్టబాధలు అవగతమవుతాయి. ఆ తర్వాత కూడా ఆకలితో అలమటించే ఓ నిరుపేదను చూసి వానికి సహకరించకపోవడమన్నది అసాధ్యం. ఉపవాసంలో అంతర్లీనమయి వున్న ఆ భావార్థాన్ని గ్రహించినవారు స్వాభావికంగా పేదవారు, కష్టజీవుల వాస్తవిక బాధల్ని గ్రహించడమే కాకుండా పెట్టుబడిదారి వర్గ దుర్గుణాలు లేని పరిశుద్ధమైన సమాజ నిర్మాణానికి స్వయంగా ప్రయత్నిస్తారు. అలా ఏ ఒక్క వ్యక్తి కూడా కూడు, గుడ్డకు అలమటించని ఓ ప్రజాస్వామ్య విధానం ఏర్పడుతుంది.

ప్రజాస్వామ్య ప్రభుత్వ విధాన స్థాపన ఫ్రెంచి విప్లవం తర్వాతే జరిగిందని సాధారణంగా భావించబడుతుంది. కాని చరిత్ర పుటలు చాటుతున్న వాస్తవం ఏమంటే ప్రపంచంలో మొట్టమొదటిగా ఏక వ్యక్తి గుత్తాధిపత్యాన్ని నిరసించి ప్రజాస్వామ్య విధాన ప్రభుత్వానికి పునాదులు వేసింది. ఇస్లాం దానినే "ఖిలాఫత్" అని పిలుస్తుంది.

ఖిలాఫత్ రాజ్యాంగంలో తండ్రి తర్వాత గద్దెనెక్కే హక్కు తనయుడికి లేదు. దేశంలో, జాతిలో అత్యంత దైవభీతి, పాపభీతి కలిగి ఉండి, ప్రజలకు ప్రీతిపాత్రుడయిన వ్యక్తికే దేశాధిపత్యాన్ని కట్టబెట్టేవారు. అలా ఖలీఫాల కాలంలో జరుగుతూ వచ్చింది. అలాగే ప్రభుత్వాల విషయంలో కూడా వారసత్వాన్ని అంతమొందించి ఇస్లాంకు పూర్వం ప్రజాస్వామ్యం అంటే ఏమిటో తెలియని ప్రపంచానికి ప్రజాస్వామ్య విలువల్ని, పద్ధతుల్ని పరిచయం చేసింది. అంతటి మహోపకారం చేసిన ఇస్లాం సేవల్ని ప్రపంచం ఏనాటికీ విస్మరించజాలదు. ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిధి కేవలం ప్రజాస్వామ్య ప్రభుత్వం, సమానతలు, న్యాయబద్ధమైన సంపద విభజన వరకే పరిమితం కాలేదు. తమ ఆలోచనలు, అభిప్రాయాలు, విశ్వాసాలు, నమ్మకాల్ని వ్యక్తం చేసేందుకు పరిపూర్ణమైన స్వాతంత్ర్యం ప్రసాదించడంతో పాటు ఇతరుల మీద తమ విశ్వాసాల్ని నమ్మకాల్ని నిర్బంధంగా రుద్దడానికి ప్రయత్నించరాదని తన అనుచరులను తీవ్రంగా హెచ్చరించి తగు చర్యలు తీసుకుంది. అంతేకాదు ప్రపంచ మత ధర్మాలు, వాని సంస్థాపకులను సవినయంగా గౌరవించాలని ప్రశంసాపూర్వకమైన హితవు చేసింది. ఇస్లాం మౌలిక సూత్రాలు, సిద్ధాంతాలు ముస్లింల ధార్మిక సంప్రదాయాల్లో ప్రధాన పాత్ర నిర్వహిస్తూనే ప్రజాస్వామ్యంలో దేశం, మతం తారతమ్యాలకు అతీతంగా ప్రవేశపెట్టిన ఉన్నతోన్నతమైన భావాలు యావత్ ప్రపంచానికి గౌరవనీయము, ఆదర్శవంతమైనవి. ఆ సూత్రాల ద్వారా ముస్లింలే కాదు, ప్రపంచమంతా ప్రయోజనం పొందింది. ❖

యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407


లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# "అంతర్వేదన" కథా సంపుటిపై 'సోదర వచనం'...

**- ఎస్. ఎం. మలిక్**




**నేను** కథ చదివి అర్థం చేసుకునే దశ నుంచి నేటి వరకు కథా కథన రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి, రూపం దృష్ట్యానూ, శైలి దృష్ట్యానూ. కథ ఎన్నో మార్పులు సుడులు తిరిగి వచ్చినది. వాటిలో కళ కళ కొరకే అన్న గుడ్డి నమ్మకం ఒకటి! అయితే ఏ ఉపయోగమూ లేని ఏ కళ అయినా, కథ అయినా అసలు ఉత్పన్నమవడమే జరగదన్నది సిద్ధాంతం!! కనీసం దాని ద్వారా ఆనందమనుభవించడమయినా ఉంటుంది గనుక!!!

జీవితంలో ఎన్నో సంఘటనలు అనుదినం జరుగుతూ ఎదురవుతాయి. కొన్ని కొందరికి సంబంధించినవయితే మరికొన్ని మనకొరకే జరుగుతాయి. ప్రతి సంఘటనకు ఎన్నెన్నో కోణాలుంటాయి. ఆ కోణాల్లో దేన్నో ఒకదాన్ని వెతికి వెలికి తీస్తాడు కథకుడు. వాటి ప్రతిస్పందనలే కథలు.

కథలు వ్రాయాలంటే స్పందించే హృదయం కావాలి. ఊహా లోకంలో గగన విహారం చెయ్యగల ఓర్పు కావాలి. ఆలోచనా పునాదులపై పంచవన్నె భవంతులు కట్టే నేర్పు కావాలి. ఇవన్ని ఉన్నా అక్షర బలంతో సుస్థిరమయిన సహనం, సంయమనం, దృక్పథం కూడా కావాలి. అప్పుడే ఓ కథ అంటూ పగటి వెలుగు చూడగలుగుతుంది.

అబ్దుల్ సమద్ గారికి ఇవన్నీ దైవికంగా ప్రాప్తమయి ఉన్నాయి. దానికి ఈ కథల సంపుటి సాక్ష్యం.


అంతేకాదు కేవలం కథకుడే కాదు సమద్ భాయి, సమాజ సంస్కరణా ధోరణికి ప్రభావితుడయి తన చుట్టూ ఉన్న వారిని ప్రభావితులుగా చేయగల సమర్థుడే సమద్ భాయి!

గృహస్థ జీవితంలో సాధారణ సంసారం మొదలుకుని, ప్రయాణావస్థలో, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే సామాన్య సంఘటనలకు కథలు రూపం ఇచ్చారు సమద్ గారు.

సమద్ గారు గీటురాయి ప్రారంభం నుంచి నేటి వరకు నలభై ఏళ్ళ కన్నా అధికంగానే సంబంధమున్న పాఠకులూ, రచయిత కూడా. తన కథానికల్లో నేటి సమాజం దర్శింపజేయడమే కాక సాధ్యమయిన సంస్కరణనూ సూచించగలిగారు ఈయన. ఈ ప్రయత్నం ఎంతవరకు ఫలించిందో చదువరులు అంచనా వేయాలన్నది నా అభిమతం.

ఇక సాహితీ దృక్పథంతో చూస్తే అక్కడక్కడ భాష, వ్యాకరణ దోషాలున్నా, సీమ పదాలు దొర్లినా మొత్తానికి అందమయిన, చదివించేలా కథలు ఇవన్నీ!

**తుదిగీటు**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**